# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి వారి

సంచిక : ఫిబ్రవరి 2023



సాహితీవేత్త, వైతాళికుడు

# శ్రీ రావి శాస్త్రి

## (రాచకొండ విశ్వనాథ శాస్త్రి)

# శత జయంతి

**Telugu Jyothi**
FEB 2023

A Literary Magazine from
**Telugu Fine Arts Society**

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

**New Jersey, USA**



*Inviting you to attend*

# Sankranthi Sambaralu





**On January 22, 2023 (Sunday)**
**from 10:00 am to 4:00 pm EST**

**At John Adams Middle School**
**1081 New Dover Rd, Edison, NJ 08820**

**Encourage and participate in our competitions**

**Join us for a delicious Vindu Bhojanamu/ Festival Lunch**

**presented by the Dynamic**

## YOUTH COMMITTEE

• Sravamti Manikonda • Niyathi Sunku • Rishita Kamarasu
• Haripriya Vellore • Rhea Thurumella • Shreeya Nooney • Ajay Rachakulla
• Tanvi Narava • Adithi Datla • Shreesh Vardhan Golla • Rayansh Boddu
• Vishrut Thoutam • Nitish Sunku • Akshaj Vellore • Samanvitha Mahidhara
• Chakradhar Pothapu • Manasvi Tata • Sravya Cheruvu
• Aashika Chinthaparthi

**Free Admission**

**Free Lunch**

*Enjoy performances by*

| | | |
|---|---|---|
| Pranavam School | Sri Sai Music Academy | Kalanjali School of Dance |
| Saraswathi Sangeetha Kalakshetra | Manasa Sangeeth Music School | Chinmayi Nrityalaya |
| Swaralaya of NJ | Premananda Natyalayam | Mahati Music Academy |
| SBU Junoon | Madhu Dowlapally, Samira Tamma, Anvitha Guduru | |



College counselling by Lisa



Taekwondo demonstration by Karate Budokan International

RECYCLE MY BATTERY by Nihal Tammana

**For additional information:**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Anu Dasari: (908) 907 1502
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025

digitalaya • +91 9246578478




75వ భారత స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా

**తెలుగు కళా సమితి** అధ్యక్షులు

**శ్రీ మధు రాచకుళ్ళ**

నిర్వహిస్తున్న సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు గాను

**గాంధియన్ సొసైటీ** వారు

2022 ఆగస్ట్ 21 వ తేదీన

ప్రశంసా పత్రం బహూకరించారు.



# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society, Inc.

A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
9 Yardley Ct, Franklin Park, NJ 08823: **http://www.tfas.net**



**Board of Trustees**
**2022-2024**

**President**
**Madhu Rachakulla**
*president@tfas.net*

**Vice President**
**Anuradha Dasari**
**Bindu Yalamanchili**
*vicepresident@tfas.net*

**Membership Services**
**Jyothi Kamarasu**
*membership@tfas.net*

**Secretary**
**Ravi Annadanam**
*secretary@tfas.net*

**Treasurer**
**Srinivas Cheruvu**
*treasurer@tfas.net*

**Community Services**
**Venkata Satya Tata**

**IT Services**
**Naga Mahendar Velishala**
*it@tfas.net*

**Youth Services**
**Sudha Devulapalli**
*youth@tfas.net*

**Advisors**
Dr. Hari Eppanapally
Radha Kasinadhuni
Dr. Satyaveni Rao
Dr. Raja Rao
Seshu Tatikatla

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


## అధ్యక్షుని కలం నుండి



తెలుగు కళా సమితి సభ్యులకు , శ్రేయోభిలాషులందరి కి సంక్రాంతి శుభాకాంక్షలు .

సంక్రాంతి అంటే మనకు రంగు రంగుల ముగ్గులు, గొబ్బిళ్ళు, కోడిపందాలు, పిండి వంటలు, గంగిరెద్దులు, భోగి మంటలు, గాలి పటాలు, బసవన్న చిందులు, హరిదాసు పాటలు ఇలా ఎంతో చక్కగా సంక్రాంతి పండుగ ఉంటుంది. మీరందరు ఈ పండగను ఆనందంగా జరుపుకున్నారని భావిస్తున్నాను. ఈ సంవత్సరంలో న్యూజెర్సీ తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో ఎడిసన్ నగరం లోని జాన్ ఆడమ్స్ మిడిల్ స్కూల్ ఆడిటోరియంలో తెలుగు కళా సమితి వారి 2023 సంక్రాంతి సంబరాలను జనవరి 22 వ తేదీన విజయవంతంగా నిర్వహించాము. తెలుగు కళా సమితిలో మొట్టమొదటి సారిగా 2023 సంక్రాంతి సంబరాలను 20 మంది యువత నిర్వహించగా, వారిని ఆశీర్వదించటానికి సుమారు 600 మందికి పైగా సభ్యులు, శ్రేయోభిలాషులు తరలి వచ్చారు.

తెలుగింటి ఆడపడుచుల సంప్రదాయ వస్త్రధారణ, తెరపై రంగు రంగుల ముగ్గులు, సంక్రాంతి ప్రాముఖ్యత తెలుపుతూ పెద్దలు పిల్లలు ప్రదర్శించిన ఆట పాటలతో సభా ప్రాంగణం అచ్చ తెలుగు పల్లె సంస్కృతికి కొలువయింది. తెలుగు సాంప్రదాయాన్ని పాటిస్తూ, తెలుగు భాషా సంస్కృతులకు సంబంధించిన కార్యక్రమాలతో ఆహ్వానితులు ఉల్లాసంగా గడిపారు.

తెలుగు కళా సమితి సంక్రాంతి సంబరాల సందర్భంగా శ్రీమతి శ్రావణి మల్లాది గారు, అందంగా, కళాత్మకంగా వివిధ రూపాలల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ప్రదర్శించిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది.

త్వరలోనే మనము త్రిమూర్తుల ఆరాధనోత్సవాన్ని జరుపుకోబోతున్నాము. తరువాత ఉగాది వేడుకలను కూడా జరుపుకోబోతున్నాం.

మీ అందరి సహాయ సహకారాలతో మరిన్ని చక్కటి కార్యక్రమాలు చేయాలనీ మా సంకల్పం. మీ సద్విమర్శలని, సలహాలని పంపించాలని నా మనవి.


**రాచకుళ్ళ మధు.**
అధ్యక్షులు, తెలుగు కళా సమితి
201-312-1305

# సంపాదకీయం

రావి శాస్త్రి గారి శత జయంతి సందర్భంగా ఆ వైతాళికుణ్ణి గుఱించి కొన్ని మాటలు చెప్పకుందాం. రావి శాస్త్రి గారనగానే శ్రీ శ్రీ, గురజాడ గుర్తుకొస్తారు. శ్రీ శ్రీ లాగా 'పదండి ముందుకు పదండి తోసుకు' అంటూ ఒక ప్రభంజనం సృష్టించ లేదాయన. గురజాడ లాగా 'పుత్తడి బొమ్మా పూర్ణమ్మా' అంటూ మనందఱికీ కంట తడి పెట్టించ లేదాయన. మున్షీ ప్రేంచంద్ లాగా కేవలం దురాచారాల భ్రష్టత్వం సంగతి చెప్పలేదు.

చాలా కాలంగా, అంటే కొన్ని వేల సంవత్సరాలుగా మన సంగీత సాహిత్యాలైతేనేమి, మత గ్రంధాలైతేనేమి, అన్నీ కూడా రాజులూ, రాణుల కథలే, వాళ్ళ కలహాలే. కొంతమంది రాజులని దేవుళ్ళన్నాం, కొంతమందిని రాక్షసులన్నాం, అదొక్కటే తేడా. శ్రీశ్రీ మాటల్లో 'నరజాతి చరిత్ర సమస్తం రాజులూ రాణులూ ..... కాలానికి కట్టిన కత్తుల వంతెన'. గురజాడ వారు ఆ స్వర్గ వాసుల వృత్తాంతాల నుండి, ఆ రాజుల చరిత్ర నుండీ భూలోకానికి దింపారు మనలని కన్యా శుల్కం (1892) నాటకంతో. అప్పటి నుండి మెల్లిగా మన సంస్కృతి దృక్కోణం మధ్య తరగతికి మళ్ళింది. కానీ మన కథా సాహిత్యం కానీ కవితలు కానీ మధ్య తరగతి వారి సమస్యలే. బీద వారిమీద దృష్టి ఎవరూ ప్రసరించలేదని కాదు. బీదవారిని కేవలం మన పని మనుషుల లాగే చూశారు రచయితలందఱూ మన మధ్య తరగతి ప్రపంచానికి దగ్గఱగా వచ్చిన పేదల తో మనం ఎలా ప్రవర్తిస్తున్నాము, react అవుతునాము అని మాత్రం రాశారు. The focus in our literature was mostly on 'US' the middle class, not them.

ఈ పరిస్థితి నుండి మన చూపు మళ్ళించిన ఘనత రావి శాస్త్రి గారికే దక్కింది. శ్రీ శ్రీ గారి కత్తుల వంతెన విషయం అందమైన కవిత్వంగా చదువుకున్నాం, అందమైన కవిత్వంలా ఆనందించాం అందఱమూనూ. ఆయన వ్రాసిన కథలు చదువుకోగల మన మధ్య తరగతి విద్యావంతులం ఆ కత్తుల వాడి తగలకుండా పాదరక్షలు వేసుకోగలం, వాహనాలెక్కగలం, జీవనం సురక్షితంగా గడుపుకోగలం. కానీ ఆ పాదరక్షలకి నోచుకోలేని బీదా బిక్కీ ఉన్నారు, వారి కాళ్ళు ఆ కత్తుల పదునుకీ వంతెన వాడికి కోసుకొని పోతున్నాయి, వారి నడక శాశ్వతంగా కుంటి నడక ఔతున్నది, బీదల పాలిట ఆ కత్తుల వంతెన నిత్య జీవిత సత్యం అని గుండెలకి హత్తుకునేట్టుగా చెప్పారు రావి శాస్త్రి గారు.

శాస్త్రి గారు తన అనుభవాలూ తను చూసిన సత్యాలు యధా తథంగా 'మిర్చి మసాలా' లేకుండా చెప్పారు. కుండ బద్దలు కొట్టి చెప్పారు అని కూడా అనలేము ఆయన కథలని. కేవలం సీదా సాదాగా నింపాదిగా రాశారు, చెప్పారు. He laid out the facts of their lives and their troubles simply and in a straight forward way. అంతే కాదు ఏ 'ఇజం', ఏ మతం, ఏ రాజకీయ రంగులు లేకుండా చెప్పారు. ఎందుకంటే ఆ కత్తుల వంతెన పదునూ వాడీ మన అనుభవంలో ఉన్న ఏ విధమైన ప్రభుత్వ పద్ధతుల్లోనైనా ఏ రాజకీయ పరిస్థుతుల్లోనైనా తగ్గేవి కాదు. ఆ వర్గపు ప్రజలకి ఊరట కలిగించాలంటే చట్టాలు సామాజిక పరిస్థితులు పూర్తిగా మారాలి. సార్వజనీనత అన్నది కేవలం ఒక నినాదం కాకుండా వాస్తవికం కావాలి అని చెప్పక చెప్పిన వైతాళికుడు రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు.

ఆయన శతజయంతి సందర్భంగా మఱొక్క నివాళి అర్పిద్దాం ఆయనకి.


## సంపాదక వర్గం

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (Editor), ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్,
బొగ్గవరపు లవకుశ, తిప్పాభొట్ల రవిశంకర్, తోడుపునూరి శ్రీనివాస్

## BOT Representatives

తాతా వేంకట సత్య, దాసరి అను

# విషయ సూచిక


| | |
|---|---|
| అధ్యక్షుని కలం నుండి | 4 |
| సంపాదకీయం | 5 |
| చెల్లని రూపాయి .. చిందం రమేష్ | 8 |
| నాగిని .. డాక్టర్ ఎమ్ సుగుణ రావు | 9 |
| ఈ పాఠశాల... పద్మావతి రాంభక్త | 13 |
| అతనే మళ్ళీ గెలిచాడు .. శింగరాజు శ్రీనివాసరావు | 13 |
| రాతి మెట్లు .. యం. రమేష్ కుమార్ | 14 |
| నాతిచరామి .. ఉప్పల పద్మ | 18 |
| విరబూసిన తెలుగు పద్మాలు | 19 |
| తెలుగు కళా సమితి సంక్రాంతి సంబరాలు | 23 |
| కాలం కడలిలో.. P.L.N. మంగారత్నం | 28 |
| నేస్తాలు .. శింగరాజు శ్రీనివాసరావు | 34 |


Opinions expressed in this volume are those of the authors and not of TFAS.

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society

www.TFASNJ.org

## తెలుగు జ్యోతి

**Web Version Announcement**

**త్వరలో తెలుగు జ్యోతి పూర్తిగా అంతర్జాల పత్రిక కాబోతున్నది.** అందులో ప్రచురితమైన రచనలన్నింటి మీదా పాఠకుల అభిప్రాయాలు రచయితల జవాబులు పరస్పరం తెలియ జేసుకోగల వీలు ఉంటుంది. ఆ మాధ్యమంలో కథలూ కవితలే కాక ఆలోచనలు రేకెత్తించే కొన్ని విషయాల మీద చర్చలు కూడా ప్రచురించాలని ఉద్దేశ్యం. **మొదటి విషయం:**

**తెలుగు వారమండీ మేము తెలుగు వారమండీ ........**

'మా తెలుగు తల్లికి మల్లె పూదండ' నర్పించే మనమందఱం తెలుగు వాళ్ళమనే గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పుకుంటాం. కానీ తెలుగు వాళ్ళం ప్రపంచం నలు దిక్కులకీ వెళ్ళి అన్ని దేశాల ఆచారాలూ ఆకళించుకుని అన్ని చోట్లా గెలుస్తున్నామనుకునే ఈ రోజుల్లో, తెలుగు తనమంటే ఏమిటి?



* పెసరట్టు రుచీ, గోంగూర పచ్చడి పసా తెలిసుండడమా?
* పంచా చీరా తెలుగు పద్ధతిన  కట్టుకోవడమా?
* సంక్రాంతికి గొబ్బెమ్మల జ్ఞాపకాలు కలబోసుకోవడమా?
* వ్యవహర్తకి ఇవి చాలు అని చెప్పే ఓ 200 వాడుక తెలుగు పదాలు మాత్రం తెలిసుండడమా?
* 'ప్రసన్న కథా కలితార్థ యుక్తి ' అంటే ఏమిటో అర్థం కావడమా
* 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని మీసం మెలిబెట్టుకంటూ ఇతరులని చిన్న చూపు చూడడమా?
* ఇతరులని చిన్న చూపు చూడకుండా మన్నించడమా?
* రాఖీ పండుగ Valentine's Day మావి కాదే కాదన్న భేషజమా?
* Hot Dog అంటే Non-Vegetarian మిరపకాయ బజ్జీ మాత్రమే సుమా అన్న సమర్థింపా?

**ఏమిటి తెలుగుతనమంటే?** ఈ విషయం మీద వ్యాసాలు కానీ, కథలు కానీ, కవితలు కానీ **ఫిబ్రవరి 28, 2023** లోపల మాకు అందేటట్లుగా **(editor@telugujyothi.com)** పంపండి. వచ్చిన వాటిలో సుమారు 20 రచనలు ప్రచురించాలని ప్రణాళిక.

ఇక షరాలు మామూలే:

1. ఈ రచన ఎక్కడా ప్రచురించలేదని హామీ పంపాలి
2. పది పేజీలకి మించకుండా ఉండాలి
3. MS WORD లోనే పంపాలి. pdf వలన చిక్కులున్నాయి.
4. ఎవరూ కూడా రెండు రచనల (ఏవైనా సరే) కన్నా ఎక్కువ పంపకండి

# చెల్లని రూపాయి

చిందం రమేష్

ఇక్కడ
సృష్టి రహస్యపు ద్వారాలేవి తెరుకుకోనివ్వరు.. .
ప్రసవవేదన ఓ సాంఘిక దురాచారం
పదునైన ఓ కార్పొరేట్ కత్తి పెట్టే
అడ్డమైన కాటుకి మాత్రం ఆచారం అంటారు....
కత్తి గాట్లకి ముహూర్తం చూసి మురిసిపోతారు...
చనుబాలని గడ్డకట్టించి ప్లాస్టిక్ డబ్బాలోకి
ఎక్కించినవాడే అసలైన నాగరికుడు...
అడ్డదారిలో వచ్చి అష్టవంకరల బుద్ధికలవాడు
స్వతంత్ర జీవివని ప్రకటించుకున్న నాడు
తల దాచుకోవడానికి పైన ఆకాశం ఉండదు
సరిహద్దులతో కుచించుకుపోతుంది...
వ్యాపార మేఘాలన్ని ఆశల తారలను కమ్మేస్తాయి...
ప్రతిరోజు ఓ చీకటి తెర వెనక
నీ చెమట చరిత్ర గొంతు నులిమి
సుగంధ లేపనాలు పూస్తారు...
ఎన్నో కృత్రిమ మేధా మధనాల మధ్య
నిన్ను పోగుల లెక్క పంచుకున్నాక
ఒక సుతారమైన సుందరి
ఒళ్లు మీద జారే సబ్బు నురుగతో చేసిన
లైట్ వెయిట్ సంకెళ్లతో నిన్ను బందిస్తారు
కాని నిన్ను బంధించిన విషయం నీకే తెలియదు...
స్వేచ్ఛగ స్వచ్ఛమైన గాలిని కూడ పీల్చలేవు...
ఆక్సిజన్ కి అత్తరు పూసి ఖరీదు కడుతారు...
ఇక వర్షం అంటావా? అది కురవదు...
నీ దుఃఖాన్ని తనలో కలుపుకోడానికి
అప్పుడప్పుడు తడిపొడిగా పడుతుంది అంతే....
టీవీలో వాణిజ్య ప్రకటనలాగ
మనిషి ఆశ అంత పొడవు నిచ్చెన వేసుకుని
ఇంద్రధనస్సుకి కొత్త రంగులు వేస్తారు...
నీ స్వతంత్రం అంతా రకరకాల రంగు సీసాల్లో
రాత్రుళ్ళు బుస్సున పొంగిస్తారు ...
ఆ నిశిధి మత్తులో నింగి నేలను ఒకటి చేసి
నేను స్వేచ్ఛా జీవినని రెండు చేతులు చాచాలన్న
ఆ సౌకర్యానికి సమయానికి అద్దె కట్టాలి....
నిత్యం కార్పోరేట్ నీకొక రేట్ కట్టి
అంగడిలో ఆటబొమ్మగా ఆడిస్తుంటే
ఇక నువ్వనుకునే
స్వేచ్ఛా, స్వతంత్రం అనేది ఇక్కడ చెల్లని రూపాయలే...

**సభ్యులందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.**

మహారాజ పోషకులు శ్రీమతి కొల్లూరి గిరిజ , శ్రీ కొల్లూరి రామ్ గార్లు



# నాగిని

డాక్టర్ ఎమ్ సుగుణ రావు

చాలా సంవత్సరాల తర్వాత ఆ ఊరు వెళుతోంది వరూధిని. అది తమ పూర్వీకుల ఊరు. తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు దగ్గర ఒక పల్లెటూరు. తండ్రిగారి ఉద్యోగరీత్యా దేశంలోని చాలా ఊళ్ళు తిరిగి ఢిల్లీలో స్థిరపడ్డారు. ఆయన తన చివరి ఉద్యోగపు జీవితం ఢిల్లీ లో ముగియడం, ఇంకా తనూ అన్నయ్యా ఢిల్లీ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి పిహెచ్.డి.లో చేరడంతో తన తండ్రిగారు దేశ రాజధాని నగరంలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నారు. తను ఎమ్ఏ కల్చరల్ స్టడీస్ ప్రధానాంశంగా చేసింది. ఇప్పుడు పిహెచ్.డి.లో తన రీసెర్చ్ ప్రాజెక్టు జానపద కళలు. అందులో భాగంగా కేరళ వెళ్ళింది. అక్కడ "తెయ్యం" అనే జానపద గ్రామీణ నృత్యం ప్రత్యేకంగా పరిశీలించింది. "తెయ్యం" నృత్యంలో దేవతామూర్తుల రూపాలతో నృత్యాలు, పూజలు చేస్తారు. రంగురంగుల భారీ కిరీటాలు, అలంకరణలతో కళాకారులు తమ గ్రామ దేవతల ముందు నర్తిస్తారు. ఆ తరువాత తను ఈ తూర్పుగోదావరి జిల్లా వచ్చేసింది, గరగ నృత్యం గురించి తెలుసుకుందామని. తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమ గరగ కళాకారులకు ప్రసిద్ధి. ఉగాది ముందురోజు ఫాల్గుణ అమావాస్య నాడు ఇక్కడ అమ్మవారి జాతరలో ఈ గరగ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఆ ఊళ్ళో తమ బంధువుల ఇంట్లో తనకు వసతి దొరికింది. చాలా సంవత్సరాల తర్వాత తను ఆ ఊరు రావడంతో.. వాళ్ళు ఆనందపడ్డారు. రాజమండ్రిలో ఫ్లైటు దిగి కారులో ఆ ఊరు వచ్చింది. కారులో గంటన్నర

ప్రయాణం. వరసకు బాబాయ్, పిన్ని అయిన ఆ దంపతులు తనను ఆప్యాయంగా ఇంటిలోకి ఆహ్వానించారు. బాబాయ్ పేరు రాఘవరావు, పిన్ని పేరు విశాలాక్షి. వారికి ఒక్కతే కూతురు. ఇంటర్మీడియట్ చదువుతోంది. పేరు గాయత్రి. ఆ దంపతులిద్దరూ టీచర్లు. వారు తనకో గది కేటాయించేసి, కావలసిన ఏర్పాట్లు చేసి ఆ ఇద్దరూ స్కూలుకు వెళ్ళిపోయారు.

ఇక గాయత్రి మాత్రం ఇంట్లోనే ఉంది. ఎమ్సెట్ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంది. ఇంకో ఆరు నెలల్లో పరీక్షలు. ఇక తన ప్రాజెక్టులో భాగంగా.. గరగ నృత్యం గురించి తెలుసుకోవడం గురించి బయలుదేరింది వరూధిని. ఆ ఇంటికి దగ్గరలోనే అమ్మవారి కోవెల. తనతోపాటు చూడడానికి వస్తానని గాయత్రి అడిగింది. ""రామ్మా.. నాకూ తోడుగా ఉంటావు"" అంది. ""అయితే అయితే.."" అంటూ గాయత్రి సంశయపడిరది. వరూధిని ఆశ్చర్యంగా చూసింది గాయత్రి వంక. ""ఈ విషయం అమ్మానాన్నలకు చెప్పకండి.. తిడతారు"" అంది.

""ఎందుకు"" అంది వరూధిని.

""నాకు ఈ గరగ నృత్యం అంటే ఇష్టం. ప్రతి సంవత్సరం అడుగుతాను అమ్మవారి జాతరలో నేనుకూడా గరగ నృత్యం చేస్తానని. "చదువుకునే అమ్మాయికు నీకెందుకు? నీకు చదువే ముఖ్యం" అంటారు. మీతో వచ్చానని తెలిస్తే తిడతారు"" అంది మెల్లగా.

""సరే నీకు ఇష్టం కాబట్టి నాతో రా.. నేను చెప్పనులే"" అంది వరూధిని. గాయత్రి ఆమెవెంట నడిచింది.

అమ్మవారి గుళ్ళో అప్పటికే చాలామంది మహిళలు గరగ ఆట కళాకారులు, గరగను తయారుచేసే పనిలో పడ్డారు. ఇత్తడి రేకులతో పూర్ణకుంభంలాగా తయారుచేస్తున్నారు. ఆ గరగకి రంగుల నేత చీరలను కుచ్చులుగా పోసి అలంకరిస్తున్నారు. గరగ పీట భాగంలో పసుపు రాశారు. అలాగే గరగలని పూలతో అలంకరిస్తున్నారు. అక్కడున్న ఒక మహిళను అడిగింది వరూధిని..

""ఈ గరగల చారిత్రిక నేపథ్యం గురించి నాకు కావాలి. ఎవరు చెబుతారు"" అంది.

""గుడి పక్కన గణాచారి గారు ఉన్నారు కూర్చుని, ఆయన చాలా సంవత్సరాలుగా గరగను ఎత్తుకుంటున్నారు.

చాలామంది పిల్లలకు గరగ నృత్యం నేర్పుతున్నారు. ఆయన్ని అడగండి చెబుతారు"" అంది ఒకామె.

ఆవిడకు థాంక్స్ చెప్పి, గాయత్రితో ముందుకు కదిలింది వరూధిని. అక్కడ పొడుగ్గా, సన్నగా ఉన్న ఒక పెద్దాయన. ఆయనకి దాదాపు డెబ్బై ఏళ్ళ వయసు పైబడి ఉంటుందేమో.. వంపులు తిరిగిన మీసాలు, జుట్టు బాగా తెల్లబడింది. నున్నగా గీసిన గెడ్డం. నుదుటిమీద పొడుగ్గా గీసిన బొట్టు.

వరూధిని ఆయనకు నమస్కారం చేసి, ""నేను గరగ నృత్యం గురించి తెలుసుకోవడానికి ఢిల్లీ నుండి వచ్చాను. నా పిహెచ్.డి.లో ముఖ్యాంశం జానపద నృత్యం"" అంది వరూధిని.

ఆ పెద్దాయన వారివంక నవ్వుతూ చూసి, గాయత్రి వంక తిరిగి, ""అవునా.. గరగ నృత్యం నేర్చుకోవడానికి వస్తానన్నావు గదా"" అన్నాడు.

ఆ మాటలకు గాయత్రి ఏమీ సమాధానం చెప్పకుండా ఊరుకుంది.

""సరేలే.. మీ అమ్మానాన్నలకు ఇష్టం లేనట్టుంది. మీ నాన్నమ్మ చాలా దీక్షగా చేసేది. ఈ గరగాట అనేది శక్తి పూజలో ముఖ్యమైన భాగం. దీనిలో తల్లిని కొలవడం కనిపిస్తుంది. ప్రధానంగా అమ్మవారి ప్రతీకే గరగ"" అన్నాడాయన.

ఆయన మాటలు శ్రద్ధగా వింటూ, ఆ గుడిమెట్ల మీద కూర్చుంది వరూధిని, గాయత్రిని పక్కనే కూర్చోబెట్టుకుంది.

ఆయన చెప్పడం మొదలెట్టాడు.. ""గరగ నృత్యానికి మూలం మహాభారత కాలం అంటారు. ద్రౌపదీ దేవి తన పెళ్ళి సమయంలో సంతోషంగా ఒక ఘటాన్ని ఎత్తి నాట్యం చేసిందట. అదే గరగ నృత్యంగా మారిందంటారు. అయితే ఇంకో కథ కూడా ఉంది. మహాభారత యుద్ధం ముగిసిన తర్వాత కొంతకాలానికి పాండవుల స్వర్గారోహణ కోసం దేవలోకం నుండి రథం వచ్చిందట. పాండవులు రథం ఎక్కిన తర్వాత చివరిగా ద్రౌపది రథం ఎక్కబోతున్న సమయంలో తిమిరాసురుడు అనే రాక్షసుడు ఆమెను వెనక్కి లాగాడు. దాంతో కోపం వచ్చిన ద్రౌపది, ఆదిశక్తిగా మారి తన దేహం నుండి వీర కుమారులను సృష్టించింది. అయితే తన శరీరం నుండి కారిన రక్తపు బొట్టుల నుండి మరో వెయ్యిమంది తిమిరాసులు పుట్టేలా ఆ రాక్షసునకు వరము ఉండడంతో, వీర కుమారులు అతన్ని ఏమీ చేయలేకపోయారు. ఆ విషయం తెలుసుకొన్ని ఆదిశక్తి రూపంలో ఉన్న ద్రౌపది తిమిరాసురుని ఒంటినుండి కారుతున్న రక్తపు చుక్కల్ని నేలమీద పడనీయకుండా తాగింది. ఆఖరుకి ఆ రాక్షసున్ని సంహరించింది. ఆమె తిరిగి ద్రౌపదిగా మారి రథం ఎక్కుతూ ప్రతి సంవత్సరం తొలిమాసం, తొలి పౌర్ణమి నాడు తాను తిరిగివస్తానని భక్తులకు మాటిచ్చి వెళ్ళిపోయింది. తన శక్తిని ఒక కుండలో పదిలపరిచింది. కుండని కన్నడంలో "కరగ" అంటారు. అలా కరగ నృత్యం ప్రాచుర్యంలోకి వచ్చింది"" అంటూ ఆయన గరగ నృత్యం గురించి చెప్పడం పూర్తి చేశాడు.

వరూధిని ఆయనకు కృతజ్ఞతలు తెలియజేసి, గాయత్రితో ఇంటిదారి పట్టింది. నడుస్తున్న వరూధిని గాయత్రితో అంది..

""మీ నాన్నమ్మవైపువారు గరగ నృత్యం చేసేవారని నాకు తెలుసు. కాని మీ నాన్నమ్మ చేసారని తెలిసి ఆశ్చర్యపోయాను. నువ్వు కూడా నేర్చుకొన్నావా?"" అంది వరూధిని.

""నాకూ ఇష్టమే.. కానీ అమ్మానాన్నలకు ఇష్టం లేదు."" అంది గాయత్రి.

""ఎందుకని"" అడిగింది.

""చదువు పాడవుతుందని, ఇంకా ఈ పల్లెటూరి నృత్యాలు ఏంటో అని మా అమ్మానాన్నలు దీనికి దూరంగా పెట్టారు""

ఆ మాటలకు వరూధిని ఆలోచనల్లో పడిరది. "అమ్మవారిని పూజిస్తారు, జాతరలు చేస్తారు గాని, పిల్లలు ఇలాంటివి చేయడానికి ఇష్టపడితే వారిని ఎందుకు

ప్రోత్సహించరో..!" అనుకుంది వరూధిని. అలా ఆలోచిస్తూనే.. ఇద్దరూ ఇంటికి చేరుకున్నారు.

తలుపులు తెరిచే ఉన్నాయి. స్కూల్ నుండి ఇంటికి వచ్చిన అమ్మానాన్నలు. వారి ముఖాలు అదోలా ఉన్నాయి. ""ఏం తల్లీ! ఆంటీతో వెళ్ళావా.. రేపు నీకు వీక్లీ టెస్ట్ ఉంది కదా"" అన్నాడు తండ్రి.

""నేనే తీసుకెళ్ళాను, నా బలవంతంమీదే వచ్చింది""

ఆ మాటలకు వాళ్ళు మౌనం వహించారు. ఆరోజు రాత్రి భోజనాలు అయిన తరువాత తన లాప్‌టాప్‌లో గరగ నృత్యం గురించి విన్న విషయాలను టైప్ చేసుకుంటోంది వరూధిని. తర్వాత బెడ్‌మీద నిద్రకు ఉపక్రమించింది. గాయిత్రి చదువుకుంటూనే ఉంది. మధ్యలో దాహం వేసి వరూధినికి మెలకువ వచ్చింది. లేచిన వరూధిని, గాయత్రిని చూసి ఆశ్చర్యపోయింది. గదిలో, తన నెత్తిమీద చిన్న స్టీలు బిందెను పెట్టుకొని చిన్నగా డాన్స్ చేస్తోంది. ఆ బిందె కింద పడకుండా చాలా చక్కగా బ్యాలెన్స్ చేసింది. చాలా ప్రాక్టీసు ఉంటేనే గాని అది సాధ్యం కాదనుకుంది. వరూధినికి అర్థమైంది, గాయత్రికి చాలా బలమైన కోరిక ఉందని. కానీ ఆమె తల్లిదండ్రులు ఎందుకు ఒప్పుకోవడం లేదు? ఏదైనా బలమైన కారణం ఉందా? అనుకుంది. ఆ విషయం మాట్లాడాని అనుకుంటూనే మంచినీళ్ళు తాగి నిద్రపోయింది.

***

తర్వాత రోజు ఆదివారం.. గాయత్రి అమ్మానాన్నలకు సెలవు. టిఫిన్లు అయిన తర్వాత గాయత్రి యథా ప్రకారం తన గదిలోకి వెళ్ళి చదువులో నిమగ్నమైంది. గాయత్రి అమ్మానాన్నలు ఇద్దరూ తమ క్లాసు పిల్లల పరీక్షా పత్రాలు దిద్దే పనిలో పడ్డారు.

వరూధిని ఆ దంపతులవైపు తిరిగి ""మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను ఏమీ అనుకోవద్దు"" అంది.

""చెప్పమ్మా పర్లేదు"" అంది విశాలాక్షి.

ఆ సమయంలో.. తల్లి పాలు తాగమని పిలవడంతో గాయత్రి ఆ గదిలోకి వచ్చింది.

""గాయత్రి గరగ నృత్యం నేర్చుకోవడానికి ఆ గణాచారి గారి వద్దకు వెళ్ళేదట, "ఎందుకు మానేశావు" అని గాయిత్రిని అడుగుతున్నాడాయన. చదువు పాడవుతుందనా, లేక ఇంకేమైనా కారణం ఉందా""

ఆ మాటలకు ఆ దంపతులు ఒక్కక్షణం మౌనం వహించారు. ఆ తర్వాత గాయిత్రి తండ్రి రాఘవరావు చెప్పడం మొదలెట్టాడు.

""మా అమ్మవాళ్ళది గరగాట కళాకారుల కుటుంబం. వంశపారపర్యంగా పెద్దవారి నుండి పిల్లల వరకు అమ్మవారి పండగలప్పుడు గరగనెత్తుకునేవారు. మా అమ్మ పూర్వీకుల కులదైవం పోలేరమ్మ. జాతరలో వారి ఆచారం ప్రకారం గరగ నృత్యం చేసేవారు. మా అమ్మానాన్నలది కులాంతర ప్రేమ వివాహం. మా నానమ్మ వారి పెళ్ళికి ఒప్పుకోలేదు. తానూ మంచి భక్తిపరురాలే. అయితే ఆవిడ సాంప్రదాయం వేరు. ఆవిడ పూజలు, వ్రతాలు వేరేగా ఉండేవి. మా అమ్మానాన్నలకు పెళ్ళైన చాలాకాలం వరకూ ఈ గరగ నృత్య విషయంలో అమ్మ నాన్నమ్మతో గొడవ పడేది. గరగ నృత్య సంప్రదాయాన్ని వదిలిపెట్టేయమని ఒత్తిడి చేసింది నానమ్మ. ఇక మా అమ్మ రాజీ పడి, తన కిష్టమైన ఆ సంప్రదాయ నృత్యానికి, జాతర్లలో గరగ ఎత్తే విషయానికి స్వస్తి చెప్పింది. ఇప్పుడు అమ్మానాన్నలిద్దరూ లేరు. ఈ గరగ విషయంలో అమ్మ పడిన దుఃఖం బాల్యంలో నాకు మిగిలిన చేదు జ్ఞాపకం. తిరిగి నా కూతురు ఆ సంప్రదాయ నృత్యంవైపు ఇష్టం పెంచుకోవడం కష్టమనిపించింది. తనను డాక్టర్ చేయాలని మా కోరిక. నేటి సమాజంలో ఆధునిక పోకడలు, రేపు ఈమెను పెళ్ళి చేసుకోబోయే అబ్బాయికి ఇవన్నీ ఇష్టం లేకపోతే ఇబ్బంది కదా. అంత్య నిష్టూరం కంటే ఆది నిష్టూరం మేలు. అందుకే నా కూతురికి ఇష్టమైన ఈ గరగ నృత్యాన్ని వద్దనుకున్నాం"" అన్నాడు గాయత్రి తండ్రి.

ఆ మాటలకు వరూధిని ""అయ్యో"" అంటూ నిట్టూర్చింది.

""మీకో కథ చెబుతాను, జరిగినదే.."" అంది వరూధిని.

ఆ మాటలకు గాయత్రి మౌనంగా అక్కడి నుండి గదిలోకి వెళ్ళబోతుంటే.. ""నువ్వూ వినమ్మా ఇది జరిగిన కథే.. చాలా

స్ఫూర్తిదాయకమైన కథ. నీలాంటి అమ్మాయిలు వినవలసిన కథే.

గాయత్రి మౌనంగా వచ్చి కూర్చుంది. ఆ దంపతులిద్దరూ ""చెప్పమ్మా.."" అంటూ వరూధిని వంక ఆసక్తిగా చూశారు.

""రాజస్థాన్ ప్రాంతంలో పాములు పట్టి ఆడించే ఒక సంచార జాతి ఉంది. ఆ తెగలో అమ్మాయిలు పాములా నడుం తిప్పుతూ నాట్యం చేస్తారు. అయితే ఆ తెగలో పెద్దలు, ఆడపిల్ల రజస్వల అయ్యేవరకే అలా నాగిని నృత్యం చేయడానికి ఒప్పుకునేవారు. పిల్ల పెద్దమనిషి కాగానే, పెళ్ళి చేసి పంపించేయడం ఆ తెగ సంప్రదాయం. అలాంటి సంచార జాతుల కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. నాలుగోసారీ ఆడపిల్లే.. అయితే ఆడపిల్లలు ముగ్గురు కన్నా ఎక్కువమంది పుడితే, ఆ సంచార జాతి పెద్దలు, నాల్గోసారి పుట్టిన పసికందును చంపేయమనేవారు. ఆ క్రమంలో ఆ తెగకు చెందిన పెద్దలు ఆ పసిగుడ్డును ప్రాణముండగానే గొయ్యితీసి పాతేసారు. కొంచెం సేపటికి ఆ పిల్ల తల్లి హృదయం క్షోభ పడింది. తన పేగు తెంచుకుని పుట్టిన ఆ ఆడబిడ్డను బతికుండగానే పాతిపెట్టడం ఇష్టంలేక, పాతిపెట్టిన చోట మట్టి తవ్వి చూసింది.

""అయ్యో.. అంత నిర్దాక్షిణ్యంగా చేస్తారా? కప్పెట్టేసిన తర్వాత ఇంకేమి బతికుంటుంది, చనిపోయి ఉంటుంది"" అని నిట్టూర్చారు అక్కడ ఉన్న ఆ ముగ్గురు.

""లేదు.."" ఆ తల్లి చూడగానే ఆ పసికందు బతికే ఉన్నట్టు కనిపించింది. మృత్యువును ఓడించిన ఆ పసికందును ఆమె, తన భర్త అక్కున చేర్చుకొన్నారు. తమ జాతి పెద్దలకు భయపడి, తమ పాముల బుట్టల్లో ఆ పాపను దాచి ఊరూరా తిప్పేవారు. పాములకు పోయగా మిగిలిన పాలును ఆ పసికందుకు పట్టేవారు. ఆ పాపకు మూడేళ్ళు వచ్చేసరికి పాములతో ఆడడం మొదలుపెట్టింది. తండ్రి బూర ఊదుతుంటే తనూ పాములాగ నాట్యం చేయడం మొదలెట్టింది. ఇలా ఆ పిల్ల పెరిగి పెద్దదై పద్నాలుగేళ్ళ తర్వాత కూడా తండ్రితో పాటు వీధుల్లో నాగిని నృత్యం చేయడం మొదలెట్టింది. ఇది ఆ జాతి పెద్దలకు నచ్చక, వారిని గ్రామ బహిష్కరణ చేస్తామని ప్రకటించారు. ఆ తల్లిదండ్రులు భయపడి, ఆ కూతురును తీసుకుని జైపూర్ వెళ్ళిపోయారు. అక్కడ పర్యాటక శాఖ అధికారుల ప్రోత్సాహంతో జైపూర్ మహారాణి ఇచ్చిన ధైర్యంతో ఆమె తన నాగిని నృత్యంలో పరాకాష్టకు చేరుకుంది. దేశంలోని వివిధ ఉత్సవాల్లో ఆమె ప్రదర్శనలు ఇచ్చేది. ఆమె ప్రదర్శించిన సర్ప నృత్యం నచ్చిన ఎలిజబెత్ రాణి, 1985వ సంవత్సరంలో ఆమెకు బంగారు పతకం ఇచ్చింది. 1990లో భారత ప్రభుత్వం జాతీయ సమైక్యతా అవార్డు ఇచ్చింది. 2016లో మన ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. ఆవిడే ""గులాబో సపేరా"".

ఆ కథ విని ఆ గదిలోని ఆ ముగ్గురూ చప్పట్లు కొట్టారు. క్షణం ఆగి చెప్పడం ప్రారంభించింది వరూధిని.

""ఆడపిల్ల అని తనను చంపబోయినా.. చావుపై గెలిచి తనంటూ ఏమిటో ప్రపంచానికి తెలియజేసింది. అయితే ఆదరణ లేక, అవకాశాలు రాక.. తమకు పెట్టిన ఆంక్షలు, పరిమితుల్లో నుండి బయటపడలేక ఎంతోమంది ఆడపిల్లలు తమ కళల్ని, కోరికల్ని అణచుకొంటున్నారు. అలాగే గాయత్రి నానమ్మ కూడా. ఇప్పుడు గాయిత్రి బాగా చదువుకుంటుంది, డాక్టర్ అవుతుంది. తనకు చదువు వల్ల వచ్చే స్ట్రెస్‌ని దూరం చేసుకోవడానికి నానమ్మ వదిలేసిన గరగ నృత్యాన్ని నేర్చుకోవాలనుకుంటోంది. ఇదేమీ తప్పుకాదు. అది మీకూ తెలుసు. భవిష్యత్తు గురించిన అనవసరమైన ఆందోళనతో ఆమె కోరిన చిన్న కోర్కెను మీరు నిరాకరించడం బాగోలేదు. రాత్రి నేను ఈ అమ్మాయి దీక్షగా చేసిన గరగ నృత్యం స్వయంగా చూశాను. తనలో ఉన్న ఈ బలీయమైన కోర్కెను, మొగ్గలోనే తుంచేయకండి. ఆడపిల్ల అభీష్టాన్ని నెరవేర్చండి"" చెప్పడం ముగించింది వరూధిని.

ఆ మాటలకు ఆ దంపతులిద్దరూ తమ కూతురు గాయత్రి తలను ప్రేమగా నిమిరారు. ""సరే మంచిరోజు చూసుకుని, గణాచారి గారి దగ్గరకు నిన్ను పంపిస్తాను"" చెప్పాడు గాయత్రి తండ్రి.

గాయత్రి మెల్లగా అడుగులు వేసుకుంటూ ఆ గదిలోంచి ముందుకు కదిలింది. ఆ సమయంలో వరూధినికి గరగనెత్తుకొని ముందుకు కదులుతున్న అమ్మవారిలా అనిపించింది ఆమె.

***** ****** *****

## ఈ పాఠశాల

పద్మావతి రాంభక్త

రోజుకొక పాఠాన్ని నేర్చుకుంటున్నా
కాలం చెప్పే గుణపాఠాలకు
మనసు ముడతలు పడుతుంది
ముడుచుకుపోతుంది

పూటకొక అనుభవం పలకరిస్తుంటే
మళ్ళీ మొదటి నుండీ
ఓనమాలు దిద్దుతున్నట్టే ఉంటుంది

ఆలోచనల పొరలు
ఒలుచుకుంటూ సాగుతుంటే
అనుభూతులకు గాయాలకు నడుమ
హృదయం లోలకమై ఊగుతూ
ఎటు మొగ్గాలో తెలియని
సందిగ్ధతలోకి ప్రయాణిస్తుంది

మది రంగు రంగుల ఆకాశమై
పగ్గాలు వదిలించుకున్న అశ్వమై
నచ్చినట్టు పరుగులు తీస్తుంది

కనులలోంచి
వాక్యమో దృశ్యమో
లోనికి జారేలోగా
ఏదో రణగొణధ్వని
దేహాత్మలను చెదరగొడుతుంది
విసుగు పొగ అంతటా కమ్ముకుని
ఎదురుగా ఎడారి దర్శనమిస్తున్న భ్రమ

ప్రతి తప్పునూ
లోకానికి ఒప్పుగా ఋజువు చేస్తూ
అహం పర్వతంలా ఎదుగుతూ
రెచ్చగొడుతుంటుంది
ఈ మంచి చెడుల బేరీజులోనే
సమయం శూన్యమై పోతుంది

జీవితమనే ఈ పాఠశాలలో
ఏ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యాడో
ఎవరు చెప్పగలరు
మనస్సాక్షికి మించిన
మంచి మాష్టారు ఎవరు
అనుభవానికి మించిన
ఉత్తమ పాఠమేముంటుంది

## అతనే మళ్ళీ గెలిచాడు

శింగరాజు శ్రీనివాసరావు

చిరిగిన చొక్కాకు అతుకులు వేసుకుంటూ
నడుస్తున్న దరిద్రానికి పైపూత వేస్తున్నాడు
రోజు కష్టమంతా సారాకొట్టుకు జమ రాసి
కుండలో గంజిని కడుపు జాగాలోకి సర్దుకున్నాడు

మెడ ఖాళీగా ఉందని తన చేయి వేసిన మూడుముళ్ళు
మరో మూడు కంచాలను గుడిసెలో పెంచాయి
కని నేల మీద పడేసిన తల్లి, తల్లిని తల్లిని చేసిన తండ్రి
పంచలో అరుగుల మీద టిక్కెట్టుకోసం చూస్తున్నారు

వీధిలో జెండాలు ఊపిరి పోసుకునే తరుణం వచ్చింది
ఓటు ధరలకు రెక్కలు వచ్చి నాలుగింతలు పెరిగాయి
పెళ పెళలాడే నోటు ముందు అవసరం ఆవులించింది
ఓటు వీరుడి రేటుకు వేలంపాట మొదలయింది

రాజకీయ సర్కసులో తీగమీద నడుస్తున్నాడు ఓటరు
పార్టీల గారడీ వాళ్ళు కరెన్సీనోట్లతో తప్పెట
కొడుతున్నారు
అధికార, ప్రతిపక్ష పార్టీల 'అబ్రకదబ్ర' మాయలో
తీగ మీద ఊగులాడుతూ నడుస్తున్న ప్రజాస్వామ్యం

పునాదులు సరిగాలేని ప్రజాస్వామ్యపు తడిగోడ
కాసులెక్కువిచ్చిన వాడి కాగితం వైపుకు వాలింది
మందు తలకెక్కి, డబ్బు చేతికి దక్కి, వేలిముద్ర గట్టిగా
పడింది
దూరాలోచన లేని మనిషిని దురాలోచన వశం చేసుకుంది

నిన్న టిదాక వంటి మీద ఈకను ఒక్కొక్కటి పెరికి
నరకయాతన చూపిన అతనే
'భో..భో..' మని పిలిచి గింజలు ఎర చూపి గద్దెనెక్కాడు
అవును..అతనే మళ్ళీ గెలిచాడు
బలహీనతల తుట్టెను పిండి తేనె తాగుతూనే ఉన్నాడు

# రాతి మెట్లు

యం. రమేష్ కుమార్

స్వింగ్ డోర్ తీసుకుని నా ముందుకు వచ్చి ఎదురుగా నిలుచున్నాడు ఆ మనిషి. అతనెవరో నాకు తెలుసు. మా వెనుక వీధిలోనే అతని ఇల్లు. కూర్చోమన్నట్టు సైగ చేసి "చెప్పండి" అన్నాను.

"నా పేరు గురుమూర్తి సార్. మా ఇంటి పక్కనే స్థలం వుంది. బహుశా మీరు కూడా చూసే వుండొచ్చు.. అక్కడ షాపులు కడుతున్నాను. ప్లాన్ ఎప్రూవల్ కోసం ఇచ్చాను. మీకు ఓ మాట చెప్పిపోదామని వచ్చాను. మనకు పరిచయం లేకపోయినా మీరు పక్క వీధిలోనే వుంటారని తెలుసు.." అన్నాడు.

"ప్లాన్ సబ్మిట్ చేశారు కదా.. సరే అలాగే లెండి.." అన్నాను.

"అదికాదు సార్.. మీకు తెలియనిది కాదు గానీ అక్కడ రోడ్ కి ఇరవై అడుగుల పైనే మార్జిన్ ఇచ్చారు. అది మెయిన్ రోడ్డు కాదు. అక్కడ రోడ్ ఎక్స్ టెన్షన్ రావడం కష్టం. వచ్చినా కూడా ఒక్కోవైపు ఇరవై అడుగులు చెయ్యరు.." అన్నాడు.

"అయితే ఏమంటారు..?" అడిగాను. అతను చెప్పేదేమిటో నాకు తెలుస్తూనే వుంది.

"ఏముంది సార్.. ఒక పది అడుగులు ముందుకు వచ్చి షాపులు కట్టుకుంటాను. పిల్లర్స్ మాత్రం వెనక్కే వేస్తాను. ఒకవేళ ఎప్పుడైనా నిజంగా అంత వరకూ రోడ్డు ఎక్స్ టెన్షన్ చేస్తే షాపులు కొంత తెగిపోతాయి.. పర్వాలేదు.

ఈ మాట ముందుగా మీకు చెప్పి వుంచుదామని వచ్చాను సార్.."

"మీరు ప్లాన్ లో ఏమిచ్చారో అంతవరకే కట్టాల్సి వుంటుంది. ముందుకి వచ్చి కడితే వాటిని కూలగొట్టే అధికారం ప్రభుత్వానికి వుంటుంది. మీకు తెలుసు కదా.." అన్నాను.

"అదేమిటి సార్ అలా అంటారు. ఆ రోడ్ లో షాపులన్నీ ముందుకి వచ్చే వున్నాయి.. రోడ్ ఎక్స్ టెన్షన్ వస్తే నేనే తొలగిస్తాను.."

"నేను రాకముందు ఎప్పుడో నిర్మాణం జరిగిన షాపుల సంగతి నాకు చెప్పకండి. అప్పుడు వాళ్ళిచ్చిన ప్లాన్ ఏమిటో.. అప్పుడున్న అధికారులు ఎందుకు అంగీకరించారో నాకు తెలీదు. వాటిని కూడా తీసేయమని ఆర్డర్ వస్తే అలాగే తీసేస్తాను. ఇప్పుడు మీరు మార్జిన్ కన్నా ముందుకు వచ్చి కడితే వాటిని తొలగించాల్సి వుంటుంది.." చెప్పాను.

గురుమూర్తి మొహంలో రంగులు మారాయి.

"అది కాదు సార్.. మనం మనం పక్క పక్క వీధుల్లోనే వుంటాం. ఆ మాత్రం మొహం చూడకపోతే ఎలా సార్..? అవసరమైతే నేనే తొలగిస్తానని చెప్తున్నాను కదా.." నన్ను ఒప్పించే రీతిలో చెప్పాడు.

"మీరు ఎంతసేపూ ఒకటే మాట చెప్తున్నారు.. ఇంకోటేదైనా చెప్పండి.. ప్రతిదానికీ ఒక పరిష్కారం వుంటుంది కదా.." అన్నాను. గురుమూర్తి ఆశ్చర్యంగా చూశాడు. నా మాటల్లో ఏదో భావం అతడికి అర్థమైంది. ఆశ్చర్యం ఎందుకంటే నేను ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతిని ప్రోత్సహించననీ, లంచం మాటెత్తననీ చాలామందికి తెలిసిన విషయం! మరి అలాంటి నేను ఇలా ఎందుకన్నానా అని అతడు నివ్వెరపోయి చూస్తున్నాడు.

నేను చిన్నగా నవ్వాను. గురుమూర్తికి పూర్తి ధైర్యం వచ్చినట్టుంది. "మీరు ఎలాగంటే అలాగే సార్.. వుత్తినే చెయ్యమనడం లేదు.." అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"సరే అయితే.." అని నాకు ఏం కావాలో చెప్పాను. గురుమూర్తికి మొదట అర్థం కాలేదు. వివరించి చెప్పాను. అతడికి ఆ ప్రపోజల్ కి ఒప్పుకోవడానికి ఇష్టం లేనట్టు

తెలుస్తూనే వుంది. కానీ తప్పదు. చివరికి అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

*****

మర్నాడు ఉదయం వాకింగ్ కి అటు వెళుతూ చూశాను. అతను కనబడలేదు. "ఇక్కడ చెప్పులు కుట్టే అతను వుండాలి కదండీ..?" ఆ పక్కన వున్న పాన్ షాపు ఆయన్ని అడిగాను.

"శంకరయ్యా..? ఇక్కడ దుకాణం పెట్టడం లేదండీ.. ఇంటి దగ్గరే పెట్టుకున్నట్టున్నాడు.." అన్నాడు.

ఇల్లు ఎక్కడో కనుక్కున్నాను. అక్కడకు దగ్గరలోనే వుంది అతడి ఇల్లు. కాకపోతే చిన్న సందుల గుండా వెళ్ళాలి. మొత్తానికి అతని ఇంటిని కనుక్కున్నాను. నన్ను చూడగానే పోల్చాడు. అప్పుడప్పుడూ అతని దగ్గర చెప్పులు కుట్టించుకోవడం ఒక కారణం అయితే నేను రోజూ ఆ దారిలో మార్నింగ్ వాక్ కు వెళ్ళడం మరో కారణం.

"మీరా బాబూ.. ఇంత దూరం వెతుక్కుంటూ వచ్చారా..? చెప్పులు కుట్టాలా..? కొత్తవి కావాలా..?" శంకరయ్య అడిగాడు.

"అదేమీ కాదులే గానీ రోడ్డు పక్కనుంచి ఇక్కడకొచ్చేశావు కదా.. నీ వ్యాపారం ఎలా వుంది..?" అడిగాను.

"ఏం వ్యాపారం బాబూ.. ఇక్కడి వరకూ ఎవరు వస్తారు..? అక్కడే కూర్చుందామంటే.." అని అతడు చెప్తుండగా ఆపుచేసి "నువ్వు అక్కడ దుకాణం ఎందుకు పెట్టలేదో నాకు తెలుసు. దాని గురించి మాట్లాడదాం. ముఖపరిచయమే తప్ప నా వివరాలు నీకు తెలీదు కదూ.. నా పేరు శేఖర్. నేను టౌన్ ప్లానింగ్ అధికారిని. అంటే ఇళ్లు లేదా షాపులు ఏవైనా కట్టుకోవాలంటే ముందు మా ఆఫీసులో వాటి తాలూకు ప్లాన్ ఎప్రూవ్ చేసుకోవాలి. ఇంతకీ నేను ఇక్కడకు ఎందుకొచ్చానంటే.." అని ఆగాను. ఈలోపు నాకో ప్లాస్టిక్ కుర్చీ వేసి కూర్చోమని చెప్పి తను ఎదురుగా చిన్న స్టూల్ మీద కూర్చున్నాడు శంకరయ్య. నేను కూర్చుని చెప్పడం మొదలుపెట్టాను.. "నీ చెప్పుల దుకాణం చాలా కాలంగా రోడ్డు పక్క వుండడం నాకు తెలుసు. అది నిజానికి ఎవరి జాగా కాదు. ఆర్ అండ్ బి వాళ్ళది. అంటే రోడ్డు విస్తరణకు వీలుగా వారి ఆధీనంలో వున్నది. క్రిందటి వారంలో ఒకరోజు నేను మార్నింగ్ వాక్ చేస్తూ ఆ రోడ్ మీద వెళ్తుండగా ఒక సంఘటన చూశాను. గురుమూర్తి మిమ్మల్ని దబాయిస్తున్నాడు. ఆ జాగా ఖాళీ చెయ్యాలనీ.. అక్కడ తను షాపులు కడుతున్నాననీ చెప్తున్నాడు. మీరు "ఎవరికీ అడ్డు లేకుండా ఒక పక్కగా వ్యాపారం చేసుకుంటాననీ, చెప్పులు కుట్టడంతో పాటు ఇప్పుడిప్పుడే కొత్త చెప్పులు కూడా పెట్టుకుని అమ్ముతున్నాననీ ఇలాంటప్పుడు పొట్టమీద కొట్టవద్దనీ" అతణ్ణి ఎంతగానో ప్రాధేయపడ్డావు. కానీ అతను ఒప్పుకోలేదు"

శంకరయ్య ఇంకా నావైపు ఆశ్చర్యంగానే చూస్తున్నాడు. ఇదంతా ఎందుకు చెప్తున్నానో.. అసలు నేనెందుకు వచ్చానో అనేది ఇప్పటికీ అతనికి అర్థం కాలేదు. "నా వల్ల ఏదైనా పొరపాటు జరిగిందా బాబూ..?" అడిగాడు.

"కంగారు పడకు.. నీ పొరపాటేమీ లేదు. నేను నీకు సాయం చెయ్యడానికే వచ్చాను. నిజానికి నువ్వు కూర్చుంటున్న జాగా అతనిది కాదనీ, అది ఆర్ అండ్ బి వాళ్ళదనీ గురుమూర్తికి కూడా తెలుసు.. అతడి షాపుల తాలూకు ప్లాన్ ఎప్రూవల్ కోసం నా దగ్గరికి వచ్చాడు. నేను ప్లాన్ ఎప్రూవ్ చెయ్యాలంటే ఒక పని చెయ్యాలని అతనికి కండీషన్ పెట్టాను. అదేమిటంటే అతను కడుతున్న షాపుల్లో ఒకదానిని నీకు సంవత్సరం పాటు ఎలాంటి అద్దె లేకుండా వ్యాపారం చేసుకోవడానికి ఇవ్వాలి.. అదే నా కండిషన్"

శంకరయ్య నా వైపు అయోమయంగా చూశాడు. ఇది జరిగే పనేనా అన్నట్టున్నాయి అతని చూపులు. అసలు నేనెందుకు అతనికి సాయం చేస్తున్నానో కూడా శంకరయ్యకు అర్థం కాలేనట్టుంది.

"శంకరయ్యా.. ఇందులో ఆశ్చర్యపడవలసింది పెద్దగా ఏమీలేదు. ఈ ఏరియాలోనే వుంటున్నవాడిగా గురుమూర్తి

స్వభావం నాకు మొదటినుంచీ తెలుసు. ఇసుక లావాదేవీల్లో, మద్యం అమ్మకాల్లో అతనికి అక్రమ సంపాదన వుంది. రాజకీయ నాయకుల అండ కూడా వుంది. బహుశా నాక్కూడా ఎవరి చేతైనా ఫోన్ చేయించేవాడేమో కానీ నేను ఎవరిమాటా విననని అతనికి తెలిసి వుంటుంది. అదీకాక అతను రోడ్ మార్జిన్ దాటి కట్టుకున్నా నేను ఇప్పటికిప్పుడు దాన్ని తొలగించననీ అందుకోసం నాకు ఈ పని చేసిపెట్టాలని చెప్పడంతో నాతో గొడవ పడే బదులు ఇదే మంచిదని ఒప్పుకున్నాడు. నేను ఇలా చెయ్యడానికి కారణం ఏమిటంటే ఎన్నో ఏళ్లుగా నువ్విక్కడ వుండడం చూస్తున్నాను. ఎవరి జోలికీ పోకుండా నీ పనేదో నువ్వు చేసుకుపోతుంటావు. ఈ మధ్యనే కొత్త చెప్పులు తేవడం, సొంతంగా తయారుచెయ్యడం కూడా చేస్తున్నావు. ఇలాంటి సమయంలో నిన్నిక్కడినుంచి వెళ్లిపొమ్మంటే చాలా ఇబ్బంది పడతావు అనిపించింది. ఆరోజు నీమీద కేకలు వేస్తున్నప్పుడు నేను పక్కనే వున్న పాన్ షాపు దగ్గర నిలబడి అంతా చూస్తూనే వున్నాను. అతడు దౌర్జన్యం చేస్తున్న విధానం చూసి నాకు చాలా కోపం వచ్చింది. కానీ అప్పుడే ఈ ఆలోచన వచ్చింది. ఎలాగూ మా ఆఫీసుకే వస్తాడు కదా.. అప్పుడు ఇతని సంగతి చూడొచ్చు అనుకున్నాను. అందుకే ఆరోజు నిన్ను బెదిరిస్తున్నా గానీ నేను కలగజేసుకోకుండా సైలెంట్ గా వుండిపోయాను. ఇప్పుడు నేను పెట్టిన కండీషన్ తో అతడు నీకో షాప్ ఇస్తాడు. సంవత్సరం పాటు నువ్వు అద్దె కూడా కట్టక్కరలేదు. ఈలోపు నీ వ్యాపారం కుదుటబడుతుంది. అప్పటికి అద్దె ఇవ్వగల స్థితిలోనే వుంటావని అనుకుంటున్నాను. ఇందులో నేనేదో నీకు పెద్ద సాయం చేసేనని అనుకోకు. ప్రస్తుతం రోడ్డు వెడల్పు కార్యక్రమం లేదు గాబట్టి అతడు కొద్దిగా ముందుకొచ్చి కట్టుకున్నా ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ వుండదు. ఒకవేళ రోడ్ వెడల్పు ఎప్పుడైనా జరిగితే అప్పుడెలాగూ ముందు భాగాన్నంతా తొలగించక తప్పదు.."

నేను విషయం పూర్తిగా వివరించాక శంకరయ్యకి అర్థమైంది. చేతులెత్తి దణ్ణం పెట్టాడు.

"నిజంగా అతను ఒక షాపు నాకు ఇస్తాడా బాబూ..?" అడిగాడు. శంకరయ్యకి నేను చెప్పిన సంగతి మీద ఇంకా గురి కుదరలేదనీ, గురుమూర్తి లాంటి వాడు తనకు సంవత్సరం పాటు ఉచితంగా షాపు ఇస్తాడంటే నమ్మకం కలగడం లేదనీ నాకు అర్థం అయింది.

"తప్పక ఇస్తాడు.. బహుశా రెండు నెలల లోపలే షాపులు కట్టడం పూర్తవుతుంది. అంతవరకూ నువ్వు కాస్త సర్దుకుంటే ఎప్పటిలాగే అదే సెంటర్ లో చక్కగా కొత్త షాపులో నీ దుకాణం నడుపుకోవచ్చు.." చెప్పాను.

తర్వాత గురుమూర్తి షాపులు పూర్తి చెయ్యడం, ఒక షాపులో శంకరయ్య కుదురుకోవడం అన్నీ సక్రమంగానే జరిగాయి. అప్పుడప్పుడూ అతడి షాపుకు నేను వెళ్తుండేవాణ్ణి. చెప్పులు కూడా అక్కడే తీసుకోవడం అలవాటైంది. షాపు అభివృద్ధికి శంకరయ్య, డిగ్రీ చదువుతున్న అతడి కొడుకు కూడా కష్టపడుతుండడం గమనించాను. మూడు నెలలు గడిచాయి. నాకు అక్కడి నుంచి ట్రాన్స్ ఫర్ అయింది. నేను వెళ్ళాక శంకరయ్య దగ్గర గురుమూర్తి మళ్ళీ అద్దె వసూలు చేస్తాడేమో అనిపించింది. షాపుకి వెళ్లి శంకరయ్యను కలిశాను. నాకు ట్రాన్స్ ఫర్ అయిన విషయం చెప్పి నా అనుమానం కూడా అతడికి చెప్పాను. శంకరయ్య నవ్వి "అలా ఏమీ జరగదు లెండి సార్.." అన్నాడు.

నేను కొత్త ప్లేసులో జాయిన్ అయ్యాను. కొత్త ఊరికి, పరిసరాలకి, మనుషులకి అలవాటు పడ్డాం. ఆర్నెల్లు ఇట్టే గడిచిపోయింది. ఒకసారి బజార్లో వెళుతుంటే ఒక వ్యక్తి నన్ను "బావున్నారా సార్" అంటూ పలకరించాడు. ఎవరా అని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించాను. నా సందిగ్ధత చూసి అతనే గుర్తు చేశాడు. అప్పుడు గుర్తొచ్చింది. శంకరయ్య పక్క షాపు ఆయనది. ఫేన్సీ షాపు నడిపేవాడు. ఏదో పని మీద ఈ వూరికి వచ్చాడట. పరిచయం వున్నవాడే కానీ చటుక్కున గుర్తు పట్టలేకపోయాను. "శంకరయ్యను అద్దె కోసం ఏమైనా మీ ఓనరు గురుమూర్తి అడుగుతున్నాడా..?" అనడిగాను. నా ప్రశ్న అతనికర్థం కాలేదు. "అద్దె కోసం అడగడమేమిటి..?

శంకరయ్య ప్రతినెలా కరెక్టుగా టైముకి అద్దె ఇచ్చేస్తాడు కదా..” అన్నాడు. నేను ఆశ్చర్యపోయి అసలు విషయమంతా చెప్పి “శంకరయ్య సంవత్సరం వరకూ అద్దె ఇవ్వక్కర్లేదు..” అన్నాను. “ఆ సంగతి ఏమో నాకు తెలీదు గానీ శంకరయ్య నాతో పాటే మొదట్నుంచి ప్రతినెలా అద్దె ఇస్తూనే వున్నాడు..” అన్నాడు. నాకు ఏమీ అర్థం కాలేదు. శంకరయ్యకు సంవత్సరం పాటు షాపు ఉచితంగా ఇప్పించగలిగానని అనుకుంటున్నాను.. అదంతా నిజం కాదా..? ఇలా ఎందుకు జరిగింది..? నాకు గాలి తీసేసినట్టయింది. వచ్చే వారంలో నాకు ఆ ఊరు వెళ్ళే పనుంది. పాత కొలీగ్ కూతురి పెళ్ళికి హాజరవ్వాలి. అందువల్ల అప్పుడు వెళ్లి శంకరయ్యను కలుద్దామని నిశ్చయించుకున్నాను.

అనుకున్న విధంగా నేను వెళ్ళినప్పుడు శంకరయ్య షాపుకు వెళ్ళాను. ఈ ఆరునెలల్లో షాపు బాగా డెవలప్ అయింది. సరుకు నిండుగా వుంది. ఎదురుగా అద్దాల షో కేసులో రకరకాల మోడల్స్ చెప్పులు, షూలు కనబడుతున్నాయి. షాపు బాగా రన్ అవుతోందని అర్థమయింది. అక్కడ శంకరయ్య వాళ్ళ అబ్బాయి వరుణ్ కూర్చొని వున్నాడు. అతడు కూడా నాకు పరిచయమే. బియ్యస్సీ చదువుతున్నాడు. నన్ను చూడగానే లేచి నిలబడి సాదరంగా ఆహ్వానించాడు. మాటామంతీ అయ్యాక నేను షాపు అద్దె విషయం అడిగాను. వరుణ్ తప్పదు అన్నట్టు చెప్పడం మొదలుపెట్టాడు.. “మీరు సంవత్సరం వరకూ షాపు అద్దె లేకుండా ఇప్పిస్తానన్నారు. నిజమే కానీ గురుమూర్తి మాకు అలా ఒప్పుకోలేదు. అద్దె చెల్లించాల్సిందే.. ఈ విషయం మీరు శేఖర్ గారికి చెప్తే నేను అసలు మీకు షాపు కూడా ఇవ్వను. అతన్తోనే సంగతి తేల్చుకుంటాను.. మరి ఏమంటారో మీ ఇష్టం..” అన్నాడు. గురుమూర్తితో గొడవ పెట్టుకోవడం మాకు ఇష్టం లేకపోయింది. ఎందుకంటే మీతో చెప్పడం వల్ల ఒకవేళ అతను ఏదోరకంగా ఒప్పుకున్నా మామీద కక్షతో పొమ్మనకుండా పొగ పెడతాడు. అదంతా ఎందుకు అనిపించింది. అప్పుడప్పుడే వ్యాపారం పుంజుకుంటున్న దశలో మాకు అక్కడ షాపు చాలా అవసరం. అది ఇస్తానన్నాడు కదా.. ఆ మాత్రం సాయం మీవల్ల జరిగింది.. అద్దైనా చాలు అనుకున్నాం. కాకపోతే మాలాంటి వాళ్ళం అంత అద్దె ఇచ్చుకుని వ్యాపారం చెయ్యడం సాధ్యమయ్యే పని కాదు. అందువల్ల తగ్గించి ఇస్తామనీ, అడ్వాన్సు కూడా ఒక నెలది మాత్రమే ఇవ్వగలమనీ, అడ్వాన్సు సంగతి గానీ.. అద్దె కడుతున్న సంగతి గానీ శేఖర్ గారికి అంటే మీకు చెప్పం అని, మా ప్రతిపాదనకు అంగీకరించమని బ్రతిమలాడాం. అతను కూడా ఒప్పుకున్నాడు. అలా షాపు ఓపెన్ చేశాం. ఇంతకుముందులా రోడ్డు పక్క షాపు కాదు.. అద్దె కట్టుకోవాలి కాబట్టి కష్టపడి షాపును ఎలాగైనా ఒక స్థాయికి తీసుకురావాలని ప్రయత్నించాం. ఇంతకుముందు నేను ట్యూషన్లు చెప్పేవాడిని. అది మానేసి నాన్నకు సాయంగా వుండటం మొదలుపెట్టాను. చదువుకుంటూనే షాపు కోసం కూడా టైము కేటాయించాను. కొత్త మోడల్స్ తెచ్చాం. మొదట్లో మార్కెట్ రేటు మీద చాలా తక్కువ మార్జిన్ వేసుకుని ఇచ్చేవాళ్ళం. షాపుకి క్రమక్రమంగా కష్టమర్స్ పెరిగారు. ప్రక్క కాలనీ నుంచి కూడా ఇక్కడికే వచ్చి చెప్పులు, షూలు కొనుగోలు చెయ్యడం మొదలైంది. వ్యాపారం పెరిగింది. అద్దె కట్టుకుంటూ కూడా షాపును లాభాల్లో నిలబెట్టాలన్న తపనే దీనికి కారణం. వ్యాపారం పెరగడం గురుమూర్తి కూడా గమనిస్తున్నాడు కాబట్టి అద్దె కూడా అందరిలాగే ఇవ్వాలని, తగ్గించి ఇవ్వడం కుదరదని పట్టుపట్టాడు. అడ్వాన్సు కూడా మొత్తం కట్టమన్నాడు. మేము ఒప్పుకోక తప్పలేదు. అప్పు చేసి అతను కట్టమన్న అడ్వాన్సు మొత్తం కట్టాం. అద్దె పెరిగింది కాబట్టి దాన్ని తట్టుకుని నిలబడాలి. అది కూడా ఛాలెంజ్ గానే తీసుకున్నాం. ఈ వ్యాపారంలో విజయం సాధించిన వాళ్ళు ఎలాంటి టెక్నిక్స్ పాటించారో తెలుసుకున్నాను. దానితో పాటు ఇక్కడ అవసరాలకి తగ్గట్టుగా మేము అమ్మాల్సిన రకాలు నిర్ణయించుకున్నాం. ఒక ప్రణాళిక ప్రకారం షాపును డెవలప్ చేశాం. ఈరోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా అద్దె కట్టుకుంటూ షాపును నడపగలుగుతున్నాం. మా ఆర్థిక

పరిస్థితి కూడా మెరుగుపడింది. దీనికి కారణం ఇద్దరు! ఒకరు మీరు.. ఈ స్థలంలోనే మాకు షాపు దొరికేలా చేశారు. మామూలుగా అయితే గురుమూర్తి మాకు షాపు ఇస్తాడన్న నమ్మకం లేదు. ఇక్కడే షాపు దొరకడం వల్ల ఈ ఏరియాలో మా నాన్నకు వున్న మంచి పేరు గానీ, మాకు ఇంతకుముందు నుంచీ వున్న కష్టమర్స్ గానీ, అలవాటైన పరిసరాలు, మనుషులు.. అన్నీ మాకు కలిసి వచ్చాయి. ఇక మా ఎదుగుదలకి రెండవ ముఖ్యమైన కారణం నేను గురుమూర్తి పేరునే చెబుతాను. ఎందుకంటే అతను షాపుకి అద్దె కట్టమనడం వల్ల దాన్ని తెచ్చుకుంటూ లాభాలు రావడానికి మేము ఎక్కువ కష్టపడ్డాం. ఈ రకంగా అతను మాకో సవాల్ ఇచ్చి

మా ఎదుగుదలకు దోహదం చేశాడని భావిస్తున్నాను. అలాగే మేము ఎదుగుతున్న సమయంలో అద్దె పెంచి మాకు మరో టార్గెట్ ఇచ్చాడు. దానితో మేము సర్వశక్తులు కేంద్రీకరించి షాపును ఇంకా డెవలప్ చెయ్యవలసి వచ్చింది. ఇదంతా మా మంచికే జరిగింది కదా! అందుకే గురుమూర్తి ఏ ఉద్దేశ్యంతో చేసినా అతడి వల్ల మేము ఈరోజు ఒక స్థాయికి చేరుకున్నామని నా భావన..!" చెప్పడం ముగించాడు వరుణ్.

అంతా విన్నాక నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. వరుణ్ చెప్పింది విన్నాక నాకు ఒకటే అనిపించింది. గురుమూర్తి వీళ్ళ మీదకు రాళ్ళు వెయ్యాలని ప్రయత్నిస్తే ఆ రాళ్లనే మెట్ల క్రింద మలుచుకుని వాటి మీదుగా పైకి వచ్చారు వీళ్ళు! ఈరోజున శంకరయ్య, వరుణ్ లు సాధించిన విజయం తక్కువదేమీ కాదు. వరుణ్ కి మనస్ఫూర్తిగా నా అభినందనలు తెలియజేశాను. శంకరయ్యను కూడా అడిగినట్టు చెప్పి మనసంతా సంతోషం ఆవరించగా అక్కణ్ణుంచి బైటకు నడిచాను.

---

## నాతిచరామి

ఉప్పల పద్మ

ఇప్పుడు అక్కడ
రెండు మనసులు నమ్మకమే భూమికగా
ముడిపడుతున్నాయి
పచ్చని పసుపుతాడు ఆ నమ్మకానికి సాక్ష్యంగా
నిలబడింది

ఇరు మనసుల్లో ఎన్నో ఊసులు
పురోహితుడు పఠిస్తున్న మంత్రాల భావం అటుంచి
వారిరువురి కళ్ళు చేసుకుంటున్న బాసలతో
వెలుగుల జిలుగులు
మోములపై నక్షత్రాలై పూచాయి

ఆమె హృదయంలో అనురాగ వేనెల్ని ఒలికిస్తుంది
నాతిచరామి అంటూ అతడు
బతుకు పేజీపై పచ్చని సంతకం చేస్తున్నాడు
కలిసిన వధూవరుల చేతుల్లో

పండంటి జీవితం పురుడు పోసుకుంటుంది
పారాణి పాదాలతో కలిసి వేస్తున్న ఏడు అడుగుల్లో
నూరేళ్ల సంసారచిత్రం జీవం పోసుకుంటుంది
వారి కాలి ధూళితో ప్రమాణ వారధి సిద్ధమవుతోంది
బంధుజనుల ఆశీస్సులు అక్షతలయ్యాయి
వారిప్పుడు ఇద్దరు కాదు ఒక్కరే

కన్నవారి ముఖాలపై సంతోషం
హృదయ తీరాన్ని చేరింది
ఒప్పగింతల సమయమూ జ్ఞాపకమొచ్చింది
అమ్మతనంతో చూసుకొమ్మని అల్లుడిని
వియ్యాలవారిని వేడుకుంటూ
మురిపాల తల్లిని
గుండెలకు హత్తుకొని
అత్తగారింటికి సాగనంపుతుంటే
హృదయాలు కన్నీటి సంద్రాలే

# విరబూసిన తెలుగు పద్మాలు!

**భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను కేంద్రం ప్రకటించింది. పలు రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు తెలుగు  ప్రముఖులను పురస్కారాలకు ఎంపిక చేసింది. తెలుగు కళా సమితి కార్యవర్గం వీరందరికి అభినందనలు తెలియచేస్తోంది.**

## చినజీయర్ స్వామి – పద్మభూషణ్

చిన జియర్ స్వామి 1956 నవంబర్ 3న దీపావళి పండుగ పర్వదినం రోజున రాజమండ్రి సమీపంలో గల అర్తమూరులో అలవేలు మంగతాయారు, వేంకటాచార్యుల దంపతులకు ప్రథమ సంతానంగా జన్మించారు. ఆయన అసలు పేరు శ్రీమన్నారాయణాచార్యులు. గౌతమ విద్యాపీఠంలో వేదం, వైష్ణవ సంప్రదాయాలలో శిక్షణ పొందారు. తర్క శాస్త్రం, సంస్కృత భాషను నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి వద్ద అభ్యసించిన శ్రీమన్నారాయణాచార్యులు .. 23 ఏళ్ల వయసులోనే తల్లి అనుమతితో1980 లో సన్యాసాశ్రమంలోకి అడుగు పెట్టారు. అనంతరం త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అయ్యారు. చిన జీయర్ స్వామి 1981 లో నడిగడ్డపాలెంలోని శ్రీమద్ ఉభయ వేదాంత ఆచార్య పీఠానికి అధిపతి అయ్యారు. సన్యాస స్వీకరణ తర్వాత కొన్నాళ్లకు గీతాజ్యోతి ఉద్యమాన్ని చేపట్టారు. విశ్వకోటికి విజ్ఞానాన్ని అందించేది ,మోక్ష సాధనకు పునాది అయిన విద్య వేదం ,అలాంటి వేద విద్యని సమస్త సమాజానికి విస్తరింపజేయడానికి జీయర్ ఎడ్యుకే,నల్ ట్రస్ట్ , వికాస తరంగిణిల ద్వారా ,ఎన్నో ఆశ్రమాలను స్థాపించారు. శ్రీరామనగరం



శంషాబాద్ లో జిమ్స్ అనే ఆసుపత్రిలో ఉచిత వైద్య విధానాన్ని ప్రవేశపెట్టి సేవలో మరో మెట్టు అధిరోహించారు. అనేక సామాజిక ,సాంస్కృతిక కార్యక్రమాలు ,అధ్యాత్మిక ఉపన్యాసాలు నిర్వహించిన తర్వాత రామానుజాచార్యుల వారి సహస్రాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ శ్రీరామనగర్ లో సమతామూర్తి విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం అందించింది.

## కమలేశ్ డి పటేల్– పద్మభూషణ్

ప్రపంచ వ్యాప్తంగా హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ గైడ్ గా, హార్ట్ ఫుల్ నెస్ ఇన్ స్టిట్యూట్, హార్ట్ ఫుల్ నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడిగా, సహజ్ మార్గ్ స్పిరిచ్యువాలిటీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న ప్రఖ్యాత ధ్యాన గురువు శ్రీరామ్ చంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ కు కేంద్రం



పద్మభూషణ్ అవార్డు ప్రధానం చేసింది. దాజీ (పెద్దన్న) అని పిలుచుకునే కమలేష్ డి పటేల్ 1956లో గుజరాత్ రాష్ట్రంలో జన్మించారు. ఫార్మసీ విద్యార్థిగా ఉన్న సమయంలోనే రాజయోగ ధ్యానం మొదలు పెట్టారు. గురువు రామ్ చంద్ర (బాపూజీ) వద్ద 1976 నుండి సాధన ఆరంభించారు. అహ్మదాబాద్ లో ఫార్మసీ గ్రాడ్యుయేషన్ అయిన తర్వాత న్యూయార్క్ వెళ్లి పీజీ పూర్తి చేశారు. అక్కడే ఫార్మా వ్యాపారం ప్రారంభించారు. భార్య, ఇద్దరు పిల్లలతో కొంత కాలం అక్కడే ఉన్నారు. 1983 లో రామ్ చంద్ర మరణంతో అధ్యక్షుడిగా పార్థసారథి రాజగోపాలాచారి (దారిజీ) బాధ్యతలు చేపట్టారు. ఆయనతో కలిసి 2003 నుండి శ్రీరామచంద్ర మిషన్ కార్యకలాపాల్లో భాగస్వామి అయ్యారు. 2014 నుండి శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. భారత్ పాటు అమెరికాలోకూడా ఆయన అధ్యాత్మిక కార్యశాలలు నిర్వహించారు. ఆయన రాసిన ది హార్ట్ ఫుల్ నెస్ వే పుస్తకానికి విశేష ఆదరణ లభించింది. పదేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం చేగూరులో 1400 ఎకరాల్లో కన్హా శాంతివనం పేరుతో ప్రపంచంలోనే అతి పెద్ద మెడిటేషన్ సెంటర్ ను నెలకొల్పారు.  అవకాశం కల్పించారు. ఇక్కడ 160 దేశాలకు చెందిన సుమారు 5వేల మంది అభ్యాసికులు ఉన్నారు. ఒకప్పుడు ఎడారిలా ఉన్న ప్రాంతంలో లక్షలాది మొక్కలు నాటి పచ్చదనం పరిఢవిల్లేలా చేశారు. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న అనేక మందికి ధ్యానంతో నయం చేస్తున్నారు. 2025లో నాటికి ఇక్కడ 30 బిలియన్ మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ధ్యాన గురువుగా ఆయన చేస్తున్న

సేవలకు ఇప్పటికే అనేక అవార్డులు అందుకున్నారు.

## ఎంఎం కీరవాణి - పద్మశ్రీ



ఎంఎం కీరవాణి అసలు పేరు కోడూరి మరకతమణి కీరవాణి. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో 1961 జులై 4న శివశక్తి దత్త, భానుమతి దంపతులకు ఆయన జన్మించారు. తండ్రి శివ దత్త రాయచూరులో ఉండటంతో కీరవాణి కొవ్వూరులోని బాబాయి చంద్రబోస్ వద్ద కొన్నేళ్ళ ఉన్నారు. కొవ్వూరులోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. ఇంటికి దగ్గర లోనే ఉన్న కవితపు సీతన్న అనే విద్వాంసుని వద్ద వయోలిన్ నేర్చుకున్నారు. తండ్రి చిత్రలేఖనం, సంగీతం, కథలు, సాహిత్యాభిలాషి కావడంతో కీరవాణికి సినిమాల వైపు దృష్టి మళ్లింది. ఈ నేపథ్యంలో ఎల్వీ ప్రసాద్ వద్ద సహాయకుడిగా చేరినా మరల కొవ్వూరు వచ్చి వ్యవసాయం, వ్యాపారం చేసినా అనుకున్న స్థాయిలో రాణించలేదు. దాంతో కర్ణాటక లోని రాయచూరు వెళ్లి అక్కడే వివాహం చేసుకున్నారు. సినీ రంగానికి వచ్చిన తొలినాళ్ళలో రాజ మౌళి, చక్రవర్తి వంటి సంగీత దర్శకుల వద్ద సహాయకుడిగా పని చేశారు. 1989 లో ఉషా కిరణ్ మూవీస్ వారు నిర్మించిన మనసు – మమత తెలుగు చిత్రం ద్వారా ఎంఎం కీరవాణి తెర నామంతో సంగీత దర్శకుడుగా వెండి తెరకు పరిచయం అయ్యారు. అప్పటి నుండి తెలుగు, తమిళ, హిందీ భాషలలో వందకు పైగా చిత్రాలకు సంగీతాన్ని అందించారు. తెలుగు సినీ రంగంలో ఎంఎం కీరవాణిగా, తమిళంలో మరకతమణి గా, హిందీ సినీ రంగంలో ఎంఎం క్రీమ్ గా ప్రసిద్ధుడైయ్యారు. 1997 లో వచ్చిన అన్నమయ్య చిత్రానికి గానూ జాతీయ స్థాయిలో ఉత్తమ సంగీత దర్శకునిగా పురస్కారం అందుకున్నారు. సంగీత దర్శకుడుగా అనేక అవార్డులు పొందిన కీరవాణి.. ఆర్ఆర్ఆర్ మువీలో స్వర పరిచిన నాటు – నాటు పాటకు ఉత్తమ అంగ్లేయేతర చిత్ర విభాగంలో ఆస్కార్ అవార్డు వరించింది.

## గణేష్ నాగప్ప - పద్మశ్రీ



తిరుపతి ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ గణేష్. ఆయన 1953లో జన్మించారు. 1970 లో బిఎస్సీ కంప్లీట్ చేసి ఆ తర్వాత 1972లో బెంగళూరు విశ్వ విద్యాలయం నుండి రసాయన శాస్త్రంలో పీజీ పట్టా పొందారు. 1976లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి పిహెచ్ డీ సాధించారు. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో రెండో పిహెచ్ డీ చేశారు. 1981 లో హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ లో చేరారు. అక్కడ దేశంలోనే తొలి డీఎన్ఏ సంశ్లేషణ (సింథసిస్) సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. 1987 లో జాతీయ కెమికల్ లేబొరేటరీ (ఎన్సీఎల్, సీఎస్ఐఆర్) కు వెళ్లారు. అక్కడ 1994 లో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగ అధిపతి అయ్యారు. 2006 లో పుణే లో ఏర్పాటు చేసిన ఐసర్ కు తొలి డైరెక్టర్ గా నియమితులైయ్యారు. గుర్తింపు పొందిన జర్నల్స్ లో 170 ప్రచురణలు చేశారు.

## కోట సచ్చిదానంద శాస్త్రి - పద్మశ్రీ



ప్రముఖ హరి కథకుడు కోట సచ్చిదానంద శాస్త్రి. రామాయణ, మహాభారత ఇతిహాసాలు, అష్టాదశ పురాణాల్లోని ఆసక్తికర అంశాలను హరికథా రూపంలోకి తెచ్చి జనాకర్షకంగా చెప్పిన ఘనత కోట సచ్చిదానంద శాస్త్రికి దక్కుతుంది. శాస్త్రి తన హరికథల గానం ద్వారా సామాజిక రుగ్మతలు పొగొట్టేలా చైతన్యపరిచేవారు. హరికథ చెప్తూ నృత్యం చేస్తూ పాటలు పాడుతూ ప్రజలను ఆకట్టుకునే వారు. హరికథా భాగవతార్ గా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కాక ఇతర రాష్ట్రాల్లోనూ 1500 లకుపైగా పదర్శనలు ఇచ్చి అనేక మంది ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. పండితులకే కాకుండా సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యేలా చెప్పి వారిని మంచి మార్గంలోకి మరలేటట్లు ప్రభావితం చేయడానికి చాలా కృషి చేశారు. అప్పట్లో ఆయన కథ వినడానికి ఎండ్ల బండ్లు కట్టుకుని గుంటూరుకు వెళ్లే వారు. 1960 నుండి 1980 వరకూ రేడియోలో వేల ప్రదర్శనలు ఇచ్చారు.

## సంకురాత్రి చంద్రశేఖర్ - పద్మశ్రీ



ప్రకాశం జిల్లా సింగరాయకొండ కు చెందిన డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ 1943 నవంబర్20 న జన్మించారు. రాజమండ్రిలో ప్రాథమిక ,కళాశాల విద్యను పూర్తి చేసిన చంద్రశేఖర్.. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో జువాలజీ లో పీజీ పట్టా పొందారు. ఆ తర్వాత కెనడాకు వెళ్లి అల్ బెట్టా విశ్వ విద్యాలయంలో పిహెచ్ డీ పొందారు. 1985 జూన్23 న భార్య మంజరి ,ఇద్దరు పిల్లలతో కెనడా నుండి ఢిల్లీకి వస్తున్న విమానాన్ని ఖలిస్థాన్ వేర్పాటువాదులు పేల్చేశారు. ఈ దారుణ ఘటన చంద్రశేఖర్ జీవితాన్ని కుదిపేసింది. ఆ తర్వాత ఆయన తన 22 ఏళ్ల కెనడా జీవిత ప్రస్థానానికి స్వస్తి పలికి ఉద్యోగాలని వదిలి భారతదేశానికి తిరిగి వచ్చేశారు. కాకినాడ జిల్లాలో సంకురాత్రి ఫౌండేషన్ స్థాపించారు. 1992 లో 25 మందితో మొదలైన ఈవినింగ్ స్కూల్ ఇప్పుడు శారదా విద్యాలయంగా ఎందరికో విద్య అందిస్తోంది.

## చింతలపాటి వెంకటపతి రాజు – పద్మశ్రీ



అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలానికి చెందిన చింతలపాటి వెంకటపతి రాజు (సీవీ రాజు) లక్క బొమ్మల తయారీలో ప్రఖ్యాత కళాకారుడు. హస్తకళలను బతికించేందుకు ఎనలేని కృషి చేశారు. ఆయన పదవ తరగతి పూర్తి చేసే సమయానికి ప్రస్తుత అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో పేరున్న హస్త కళాకారులు కళకు ఆదరణ లేక గ్రామాన్ని విడిచి కూలీ పనులకు వలస పోయే వారు. అది చూసిన సీవీ రాజు.. ఏటికొప్పాక పేరును తిరిగి నిలబెట్టాలని లక్క బొమ్మల పరిశ్రమపై దృష్టి సారించారు. ఢిల్లీకి వెళ్లి అధ్యయనాలు చేశారు. 1999లో ఏటికొప్పాకలో హస్తకళా నిలయాన్ని ఏర్పాటు చేసి కళాకారులకు అధునిక బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. వారు తయారు చేసిన బొమ్మలకు వారే ధర నిర్ణయించుకునేలా చేశారు. పసుపు, ఇండిగో పిక్కలు, జాఫ్రా, కరక్కాయ తదితరాల తో ప్రకృతిసిద్ధమైన రంగుల తయారీకి శ్రీకారం చుట్టారు. ఇలా కృషి చేస్తున్న సీవీ రాజుకు ఆర్ట్స్ విభాగంలో ప్రతిష్టాత్మక పద్మ శ్రీ అవార్డు వరించింది.

## అబ్బారెడ్డి నాగేశ్వరరావు – పద్మశ్రీ



ఏపికి చెందిన డాక్టర్ అబ్బారెడ్డి నాగేశ్వరరావు (69)కి సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆయన ఆర్కిడ్ జాతికి చెందిన 35 రకాల మొక్కలను కనుగొన్నారు. మణిపూర్ లోని సెంటర్ ఫర్ ఆర్కిడ్ జీన్ కన్జర్వేషన్ ఆఫ్ ఈస్టర్న్ హిమాలయాస్ రీజినల్ డైరెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. 2012 లో ఆయన రిటైర్ అయ్యారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఆయన దశాబ్దాల పాటు సేవలు అందించారు. ఆయన పరిశోధనలకు గుర్తింపుగా రెండు ఆర్కిడ్ జాతి మొక్కలకు ఆయన పేరు పెట్టారు.

## ప్రకాష్ చంద్ర సూద్ – పద్మశ్రీ



ప్రకాష్ చంద్ర సూద్ సత్యసాయి విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్నారు. పంజాబ్ లో 1928 సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన అక్కడే ప్రాథమిక, ఉన్నత విద్యా పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికా వెళ్లి పీ హెచ్ డి చేశారు. 1969 నుండి 1988 వరకూ వారణాసి లోని బెనారస్ హిందూ యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పని చేశారు. 1988 లో రిటైర్ అయ్యారు. ముంబాయిలోని బాబా అణు పరిశోధన కేంద్రంలో 1998 నుండి 1999 వరకూ పని చేశారు. సత్యసాయి బాబా సూచనల మేరకు 1998 నుండి సత్యసాయి విశ్వ విద్యాలయంలో విద్యాబోధనతో పాటు పరిశోధన అధ్యాపకుడుగా పని చేస్తున్నారు. ప్రత్యేకంగా న్యూక్లియర్ ఫిజిక్స్ ఎడ్యుకేషన్ రంగంలో ముందుకు వెళుతున్నారు. ప్రస్తుతం ఆయన భారతదేశంలోని అత్యంత సీనియర్ అణు శాస్త్రవేత్తలలో ఒకరు.

## డాక్టర్ ఖాదర్ వలీ – పద్మశ్రీ



, చిరు ధాన్యాల ఉపయోగాలువాటి వినియోగం గురించి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటిని ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఖాదర్ వలీకి పద్మశ్రీ పురస్కారం లభించింది. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో జన్మించిన ఆయన బీఎస్సీ ,ఎంఎస్సీ) ఎడ్యుకేషన్) మైసూర్ లోని రీజినల్ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ లో పూర్తి చేశారు. అమెరికాలోని డ్యూపాండ్ కంపెనీలోనూ బాధ్యతలు నిర్వహించారు. అంతరించి పోతున్న అయిదు రకాల చిరు ధాన్యాలైన కొర్రలు ,అండు కొర్రలు ,సామలు , అరికెలు , ఊదల పునరుద్ధరణకు కృషి చేశారు.

## డాక్టర్ పసుపులేటి హనుమంతరావు – పద్మశ్రీ




డాక్టర్ పసుపులేటి హనుమంతరావు పిల్లల వైద్య నిపుణులు. 1945 సెప్టెంబర్16 న హైదరాబాద్ పాత నగరంలో జన్మించారు. కాకతీయ విశ్వ విద్యాలయంలో1970 లో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. 1975 లో ఎండీ2002 ,లో పిహెచ్ డీ పూర్తి చేశారు. పిల్లల వైద్యునిగా పని చేసిన ఆయన క్రమేపీ మానసిక వైకల్యం గల పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వీరి కోసం సేవలందించేందుకు ఆయన వ్యవస్థాపక చైర్మన్ గా స్వీకార్ మల్టిస్పెషాలిటీ రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. లక్షల మంది దివ్యాంగ పిల్లలకు వైద్యునిగా విశేష సేవలు అందించారు. 6,500 మంది వైద్యులకు దివ్యాంగుల పునరావాస చికిత్స కు అవసరమైన శిక్షణ ఇచ్చారు. గాంధీ ,నిలోఫర్ తదితర ఆసుపత్రుల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కడప ,గుంటూరు ,తాండూరు లో స్వీకార్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యా కేంద్రాలను నెలకొల్పారు. మొత్తం35 కి పైగా జాతీయ , రాష్ట్ర అంతర్జాతీయ పురస్కారాలను పొందారు. దాదాపు 45 సంవత్సరాల పాటు ఆయన అందించిన సేవలను భారత ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది.

## మొదడుగు విజయ గుప్తా- పద్మశ్రీ



మొదడుగు విజయ గుప్తా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. గుప్తా బాపట్లలో 1939 ఆగస్టు17 న జన్మించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి బీఎస్సీ ,బనారస్ హిందూ విశ్వ విద్యాలయం నుండి ఎమ్మెస్సీ , కోల్ కతా విశ్వ విద్యాలయం నుండి డాక్టరేట్ పొందారు. పంత్ యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చర్ టెక్నాలజీ సెంటర్ , ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషనల్ లో డాక్టర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందారు. పదవీ విరమణ తర్వాత గ్లోబల్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ (వరల్డ్ ఫిష్) లో సహాయ డైరెక్టర్ జనరల్ గా పని చేశారు. కేంద్రం ,ఉమ్మడి ఏపితో పాటు తెలంగాణ ప్రభుత్వంలో మత్స్య శాఖ సాంకేతిక సలహాదారుగా పని చేశారు. దేశంలో నీలి విప్లవం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. చేపల ఉత్పత్తి పెరగడంలో విశేష కృషి చేసి మత్స్య శాఖ శాస్త్రవేత్త మొదడుగు విజయ్ గుప్తా.

## ప్రొఫెసర్ బీ రామకృష్ణారెడ్డి – పద్మశ్రీ



ప్రొఫెసర్ బీ రామకృష్ణారెడ్డి గిరిజన భాషలను పరిరక్షించినందుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది. చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలానికి చెందిన ఆయన వయసు 80 సంవత్సరాలు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ,కుప్పంలోని ద్రవిడ విశ్వ విద్యాలయానికి రిజిస్ట్రార్ గా బాధ్యతలు నిర్వహించారు. గిరిజన భాషలైన కువి ,మండల పై విస్తృత పరిశోధనలు చేశారు. గిరిజన భాషలను కూడా అధికార భాషలుగా గుర్తించాలని కోరుతున్న ఆయన దేశంలో 200 భాషలు ఉంటే అందులో 50 వరకు గిరిజన భాషలు ఉన్నాయని పేర్కొంటున్నారు. మైసూరు సీఐఐఎల్ లో పని చేసిన నాటి నుండి గిరిజన భాషలపై ఆయన పరిశోధనలు ఆరంభించారు.


CITIAIR

BHOG

North America Telugu Society (NATS)
భాషే రమ్యం – సేవే గమ్యం
NATS
ఉత్తర అమెరికా తెలుగు సంఘం

# న్యూజెర్సీ తెలుగు కళా సమితి వారి సంబరాల సంక్రాంతి

అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఎడిసన్ నగరం లోని జాన్ ఆడమ్స్ మిడిల్ స్కూల్ ఆడిటోరియంలో తెలుగు కళా సమితి వారి 2023 సంక్రాంతి సంబరాలను జనవరి 22 వ తేదీన విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు తెలుగు కళా సమితి కార్యవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన, చిరంజీవి స్రవంతి మానికొండ ప్రార్థనా గీతం తో కార్యక్రమం ప్రారంభించారు. తెలుగు కళా సమితిలో మొట్టమొదటి సారిగా 2023 సంక్రాంతి సంబరాలను 20 మంది యువత నిర్వహించగా, వారిని ఆశీర్వదించటానికి సుమారు 600 మందికి పైగా సభ్యులు, శ్రేయోభిలాషులు తరలి వచ్చారు.

ఈ సందర్భంగా తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ మధు రాచకుళ్ళ మాట్లాడుతూ తెలుగు కళా సమితి సంక్రాంతి సంబరాలు అంటే యువజనోత్సవాలు అని, ఇక్కడ పుట్టి పెరిగిన పిల్లలకు సంక్రాంతి పండుగ ప్రాముఖ్యత , తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాల ను ప్రతిబింబించే విధంగా ప్రాంతీయ యువ కళాకారులతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియచేసారు. తెలుగు కళా సమితి యువత లో నాయకత్వ ప్రతిభను పెంపొందించటానికి ఈ సంవత్సరం సంక్రాంతి సంబరాలను పూర్తి గా యువతతోనే నిర్వహించాలని కార్యవర్గ సభ్యులంతా నిర్ణయించి, ఆవిధంగానే వారితోనే నిర్వహించారని తెలియచేశారు.

ఆద్యంతమూ పండుగ వాతావరణం, అడుగడుగునా తెలుగుతనం ఉట్టిపడేలా జరిగిన ఈ సంక్రాంతి సంబరాల్లో అందరిని ఒక్కసారి ఊళ్ళల్లో జరుపుకునే పండుగ జ్ఞాపకాలను గుర్తుకొచ్చేలా చేసింది. తెలుగింటి ఆడపడుచుల సంప్రదాయ వస్త్రధారణ, తెరపై రంగు రంగుల ముగ్గులు, సంక్రాంతి ప్రాముఖ్యత తెలుపుతూ పెద్దలు పిల్లలు ప్రదర్శించిన ఆట పాటలతో సభా ప్రాంగణం అచ్చ తెలుగు పల్లె సంస్కృతికి కొలువయింది. తెలుగు సాంప్రదాయాన్ని పాటిస్తూ, తెలుగు భాషా సంస్కృతులకు సంబంధించిన కార్యక్రమాలతో ఆహ్వానితులు ఉల్లాసంగా గడిపారు.

తెలుగు కళా సమితి సంక్రాంతి సంబరాల సందర్భంగా శ్రీమతి శ్రావణి మల్లాది గారు, అందంగా, కళాత్మకంగా వివిధ రూపాలల్లో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ప్రదర్శించిన బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. . భోగ్ రెస్టారెంట్ వారు అచ్చతెలుగు వంటకాలతో, షడ్రసోపేతమయిన విందు భోజనం వడ్డించారు.

కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం మొత్తం భోజన ఏర్పాట్లు మరియు కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించారు. . ఆర్థిక వ్యవహారముల పర్యవేక్షణ ను మరియు మహిళలకు వంటల పోటీలను కోశాధికారి శ్రీ శ్రీనివాస్ చెరువు నిర్వహించారు. యువజన కార్యదర్శి శ్రీమతి సుధా దేవులపల్లి గారు ఈ సంక్రాంతి సంబరాల సాంస్కృతిక కార్యక్రమాల రూపకల్పన చేసి, యువత చేత నిర్వహింపచేసారు. ఈ సందర్భంగా బాలబాలికలకు ముగ్గుల పోటీలను మరియు వేదిక పైన అలంకరణ విషయాలను ఉపాధ్యక్షురాలు శ్రీమతి అనూరాధ దాసరి నిర్వహించారు. తెలుగు పద్య,వచన పఠనం, తెలుగు మాట్లాట పోటీలను కమ్యూనిటీ కార్యదర్శి శ్రీ వెంకట సత్య తాతా నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలను ఉపాధ్యక్షురాలు శ్రీమతి బిందు యలమంచిలి నిర్వహించారు. కమ్యూనిటీ కార్యదర్శి వెంకట సత్య తాతా వెండర్స్ నిర్వహణ మరియు వాలంటీర్లు విషయాలను పర్యవేక్షించారు. మెంబర్ షిప్ కార్యదర్శి శ్రీమతి జ్యోతి కామరసు ఈ సంక్రాంతి కార్యక్రమాల ప్రోగ్రాం షీట్ తయారుచేయటం, వేదిక మీద యువతను సమన్వయ పరచటం మరియు నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు. ఐటి కార్యదర్శి శ్రీ నాగ మహేందర్ వెలిశాల మీడియా మరియు ఇమెయిల్ ప్రచారం వంటి బాధ్యతలను నిర్వహించారు.

తెలుగు కళా సమితి 2023 సంక్రాంతి సంబరాలను నిర్వహించిన యువత : లిఖిత కామరసు, నియతి సుంకు, హరిప్రియ వెల్లూర్,రియా తురుమెళ్ళ, స్రవంతి మానికొండ, శ్రీయ నూనే, అజయ్ రాచకుళ్ళ, తన్వి నారవ, అదితి దొట్ల, శ్రీష్ వర్ధన్ గొల్ల, రేయాన్ష్ బొడ్డు,విశ్రుత్ ధౌటం,నితీష్ సుంకు, అక్షజ్ వెల్లూర్,సమన్విత మహీధర, చక్రధర్ పోతపు,మనస్వి తాతా, శ్రావ్య చెరువు,ఆషిక చింతపర్తి.

ఈ సంక్రాంతి సంబరాలకు యూత్ సబ్ కమిటి మెంబర్స్ గా శ్రీమతి కాంతి పూసపాటి , శ్రీమతి శ్రీవిద్య మానికొండ, శ్రీమతి లక్ష్మి చిత్ర సుంకు, శ్రీమతి ప్రతిభ ఇసుకపల్లి వ్యవహరించారు. పేరెంట్ వాలంటీర్స్ గా శ్రీమతి సరితా వెల్లూర్, శ్రీమతి రంజిత బొడ్డు, శ్రీమతి అర్పిత నూనే, శ్రీమతి జలజ గొల్ల, శ్రీమతి ఉమా తురుమెళ్ళ వ్యవహరించారు.

తెలుగు కళా సమితి అడ్వైజర్స్ శ్రీ హరి ఎప్పనాపల్లి గారు, శ్రీ రాజారావు బండారు గారు పూర్వపు అధ్యక్షులు శ్రీ దాము గేదల గారు,శ్రీమతి మంజు భార్గవ గారు, శ్రీ శ్రీనివాస్ గండి గారు, శ్రీ సుధాకర్ ఉప్పల గారు మరియు పూర్వపు కార్యవర్గ సభ్యులు శ్రీమతి గిరిజా కొల్లూరి గారు, శ్రీ సత్య నేమాని గారు, శ్రీ మధు అన్నా గారు, శ్రీ వంశీ కొప్పరావూరి గారు, శ్రీ శ్రీనివాస్ భర్తవరపు గారు , శ్రీమతి జ్యోతి గండి గారు తదితరులు ఈ సంబరాలను నిర్వహించిన యువత ను ఆశీర్వదించారు. వీరందరూ తెలుగు కళా సమితి కార్యవర్గ సభ్యులతో కలిసి పోటీలలో విజేతలుగా నిలిచిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమాలకు అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు శ్రీ శ్రీనివాస్ తుమ్మల గారు,శ్రీ గంగాధర్ దేసు గారు, శ్రీ శ్రీధర్ అప్పసాని గారు, శ్రీమతి అరుణ గంటి గారు,శ్రీ మురళి మేడిచర్ల గారు, శ్రీ హరి బుంగతావుల గారు, శ్రీ ఓం మడూరి గారు,శ్రీ ప్రవీణ్ గూడూరు గారు, శ్రీ సత్యనారాయణ మూర్తి తమ్మినీడి గారు, ఎడిసన్ ఎడ్యుకేషన్ బోర్డు మెంబర్ శ్రీ బిరల్ పటేల్ మరియు ప్రముఖ వేద పండితులు శ్రీ రఘు శంకరమంచి గారులు మాట్లాడుతూ, సంక్రాంతి సంబరాల సాంస్కృతిక కార్యక్రమాలలో పాలు పంచుకోవడం మరింత ఆనందం గా ఉందని, మనదైన సంస్కృతిని, సంప్రదాయాన్ని పిల్లలకు అందించడానికి ఇటువంటి వేడుకలు అవసరం అని చెప్పారు.

ఈ సంక్రాంతి సంబరాలలో ప్రణవం స్కూల్ అఫ్ డాన్స్, కళాంజలి స్కూల్ అఫ్ డాన్స్, శ్రీ సాయి మ్యూజిక్ అకాడమీ, సరస్వతి కళాక్షేత్ర, మానస సంగీత్ మ్యూజిక్ స్కూల్, ప్రేమానంద్ నాట్యాలయం, చిన్మయి నృత్యాలయ, స్వరాలయ అఫ్ న్యూజెర్సీ, మహతి మ్యూజిక్ అకాడమీ, మధు దొలపల్లి, సమీరా తమ్మా, అన్విత

గూడూరు తదితరులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కరాటే బుడోకాన్ ఇంటర్నేషనల్, అమెరికా విద్యార్థులు కరాటే విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాలేజీ అడ్మిషన్స్ పై శ్రీమతి **లిసా** ఇచ్చిన ఉపన్యాసం చాలా ఉపయోగకరంగా ఉన్నదని చాల మంది తల్లితండ్రులు తెలియ చేసారు. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ కీరవాణి గారికి గోల్డెన్ గ్లోబ్ అవార్డు వచ్చిన సందర్భంగా స్టోనీ బ్రూక్ యూనివర్సిటీ జనూన్ విద్యార్థులు సిద్దార్థ్ నేతృత్వంలో 'నాటు నాటు' పాటకు చేసిన డాన్స్ అందరిని అలరించింది. సి ఎన్ ఎన్ హీరో అవార్డు పొందిన చిరంజీవి శ్రీ నిహాల్ తమ్మన తాను నిర్వహించిన మై రీసైకిల్ బ్యాటరీ గురించి వివరించాడు. ఈ చిరంజీవి శ్రీ నిహాల్ తమ్మన ను తెలుగు కళా సమితి కార్యవర్గ సభ్యులు సత్కరించారు.

ఈ సాంస్కృతిక కార్య క్రమాలకు సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసిన శ్రీ సిజి ఆనంద్ గారిని, ఈ సంక్రాంతి వేడుకలను చక్కగా చిత్రీకరించిన ఫోటోగ్రాఫర్ ఆనంద్ గారిని మరియు రుచికరమైన భోజనం అందించిన భోగ్ రెస్టారెంటు వారికి, ఈ కార్యక్రమాలను ప్రసారం చేసిన శ్రీ జగదీష్ యలమంచిలి గారికి , శ్రీ శ్రీధర్ చిల్లర గారికి, శ్రీమతి స్వాతి నల్లూరి గారికి, శ్రీ కృష్ణ గారికి మరియు ఇతర మీడియా మిత్రులకు  తెలుగు కళా సమితి  కార్యవర్గం ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేసింది.  ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ విభాగాలలో కష్ట పడిన వాలంటీర్స్ శ్రీ సత్య చలువాది గారు, శ్రీ హర్ష గొల్ల గారు, శ్రీ సుధాకర్ ధూలిపాళ్ళ గారు, శ్రీ రవి నారవ గారు, శ్రీ రవి మహీధర గారు, శ్రీ సీతారాం సుంకు గారు,  శ్రీ ప్రసాద్ మానికొండ గారు, శ్రీ రవి రాచూరు గారు,






శ్రీ అన్నాజీరావు వడ్లమాని గారు, శ్రీ రవి కామరసు గారు, శ్రీమతి వరలక్ష్మి అన్నదానం గారు,  శ్రీమతి లక్ష్మి రాచకుళ్ళ గారు, శ్రీమతి నాగేశ్వరి చెరువు గారు, శ్రీ  సత్య అలపాటి గారు, శ్రీ మహేంద్ర సూర్పుర్  గారు, శ్రీ గోపికృష్ణ పొదిలి గారు, శ్రీమతి మీనా కురిచేటి గారు,  శ్రీ జయ్ మంద గారు, శ్రీ సీతారామ రెడ్డి నంద్యాల దంపతులు, శ్రీమతి నాగమణి గ్రంధి గారు, శ్రీమతి చంద్ర తమ్మినీడి గారు, శ్రీమతి శిరీష పులిజాల గారు, శ్రీ రాజ్ కుమార్ నూనే గారు తదితర వారందరికీ కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం పేరు పేరునా ధన్యవాదాలు చెపుతూ జనగణమన జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.









పర్యావరణ పరిరక్షణ
మన భూమి 4 బిలియన్ సంవత్సరాలనుండి ఉంది. జీవజాలాలు భూమి మీద మాత్రమే ఉంటాయి. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం భూమి మీద 300,000 రకాల మొక్కలు , 500,000 రకాల క్రిమికీటకాలు ఇంకా 10,000,000 రకాల జంతువులు నివాసం ఉంటాయి.
అడవులు కొట్టి చేస్తున్న పోడు వ్యవసాయంతో భూసారం పోతోంది.
Help Our Planet!
నేల చౌడుబారిపోయి ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో సముద్రానికి 50 కిలోమీటర్ల దాకా ఉప్పు నీరు వచ్చి కొన్ని ఊర్లు తాగు నీటికి దూరం అవుతున్నాయి.
మనం ఏం చేస్తే మన మట్టిని కాపాడుకోగలమో చూద్దాం.
Ways to Help!
1. Speak-
2. Renewable Energy!-
3. Don't waste water!-
4. Eat the food you buy-
5. Reduce! Reuse! Recycle!
wasted
By: Deepthi Suri






CITIAIR
CITIAIR


Join us as Business Partner
What Can We Help


John Adams Middle School
RESPECT
RESPONSIBILITY
Be accountable for your choices.
EXCELLENCE
the quality of being outstanding or extremely good.


PUSH
HOMEROOM
7-10
ALL
ARE
WELCOME








Telugu Fine Arts Society
సంక్రాంతి సంబరాలు







# కాలం కడలిలో..

P.L.N. మంగారత్నం

ఆరోజు .. ఉదయం

సుదతికి మెలకువ వచ్చేసరికి సమయం ఎనిమిదిన్నర. రాత్రి గుండె నొప్పికి మాత్ర వేసుకుని పడుకుందేమో! లేచే సరికి అంత టైము అయ్యింది. దానికి తోడు కొత్తగా షుగరూ .. బీ.పీ కూడా వచ్చి చేరాయి నలభై దాటకుండానే.

డాక్టర్లు "జబ్బేమీ లేదు. కొద్దిగా బలహీనం" అంటారు.

మందులు .. మందులు లాగానే ఉన్నా, ఓపిక మందగించింది.

బాగాలేని రోజుల్లో పిల్లలే వంట కూడా చేసి కాలేజీకి వెళుతున్నారు.

"అమ్మా! లేచావా? లే... లేచి బ్రష్ చేసుకుంటే, కాఫీ ఇస్తాను" అంది తల్లి వంక జాలిగా చూస్తూ పెద్దకూతురు వినతి.

కూతుర్ని చూడగానే, రాత్రి జరిగిన సంఘటన కళ్ళ ముందు మళ్ళీ మెదిలి... అప్రయత్నంగానే రెండు కన్నీటి చుక్కలు రాలిపడ్డాయి.

తల్లి బాధ తెలిసినా ఏమీ చెయ్యలేని పరిస్థితి. "సరిలే .. ఊరుకో. ఇంకా దాన్నే తలుచుకోకు" ఓదార్పుగా తల్లి చెయ్యి మీద, చెయ్యి వేసి లేచింది వినతి. ఇంకా సమయం తీసుకుంటే కాలేజీకి ఆలశ్యం కావచ్చని.

రాత్రి గొడవ తాలూకు బాధావీచికలు .. ఇంటిని నిశ్శబ్దంగా మార్చేసాయి. సూది క్రింద పడ్డా వినిపించేలా. ఇవన్నీ ఆమె భర్త "ఋషేంద్ర" కి మామూలే. తాడుని తెగేదాకా లాగితే .. జీవితం విలువేంటి?

మరో అరగంటకు భర్తా, పిల్లలూ బయలుదేరారు.

వీధి తలుపు వేసుకోవడానికని వచ్చిన సుదిత .. ఎదురింట్లో దృశ్యాన్ని చూస్తూ ఓ నిముషం నిలబడిపోయింది.

సరిగ్గా ..

ప్రతిరోజూ .. అదే సమయానికి, ఎదురింటి అతను కూడా డ్యూటీకి బయలుదేరతాడు. గుమ్మంలో ఉండగానే, అతని కన్నా .. ఆమె రెండడుగులు ముందుగా నడచి, వెనక్కి తిరిగి వచ్చేస్తుంది. అంటే, ఆమె బయటకు వెళ్ళే భర్తకు "ఎదురు" వస్తుందన్న మాట.

కొంతమంది మగవాళ్ళు తల్లినో, భార్యనో ఎదురు రప్పించుకుంటారు. ఇంట్లో వాళ్ళ ఎదురు మంచిదని.

అది ఒక నమ్మకమే అయినా కుటుంబ సామరస్యానికి దోహదపడే అంశంగా అప్పుడప్పుడే తెలుసుకుంటుంది సుదతి. తన భర్తకు అలాంటి నమ్మకాలూ ఏవీ లేవు.

వెళ్ళేటపుడు కనీసం చెప్పాలనీ అనుకోడు. బయలుదేరుతున్నాడనుకుంటే, తను అక్కడక్కడే ఉంటుంది. కావలసిన జేబురుమాలో! కళ్ళజోడో! అందించాలేమో అన్నట్లు .. అవి అందించినా .. పోతూ పోతూ చెప్పులు వేసుకుంటూ "ఇక్కడ తుడుపు సరిలేదు .. అక్కడ ఇంకేదో సరిలేదు" అనుకుంటూనే అడుగుబయట పెడతాడు.

***

భోజనం అయ్యిందనిపించి, నిస్త్రాణంగా మంచం మీద వాలింది సుదిత.

"దేవుడు అందరిలా సుఖపడే రాత దేవుడు నా నుదుటన రాయలేదు" పెళ్లై, ఇరవై ఏళ్ళు కావస్తున్నా పరిస్థితి మారని తన బ్రతుకు గురించి ఆలోచిస్తూ.

ముందు రోజు రాత్రి ..

వట్టి పుణ్యానికే గొడవకు దిగాడు భర్త. తను అంత "పొరపాటు "మాటా" అనలేదు.

తాము ఉండేది అంత పల్లే కాదు .. పట్టణమూ కాదు.

వీధిలోకి తోపుడు బండి మీద కొన్ని రకాల పింగాణీ వస్తువులు అమ్మకానికి వచ్చాయి "కోపాలూ, ఫ్లవర్ వాజులూ, పింగాణీ బొమ్మలూ" అంటూ అరుస్తున్నాడు అతను.

ఆ అరుపులకు ఆ వీధిలోని ఆడవాళ్ళు చాలా మంది ఇళ్ళ ముందుకు చేరుకున్నారు. ఏదిలో ఏది అమ్మవచ్చినా అలాగే నలుగురైదుగురు కలిసి .. చూసి బాగుందని అనుకుంటేనే కొంటారు.

అలాగే, తనూ వెళ్ళింది.

ఇంతకు ముందెప్పుడూ ఆలాంటి వస్తువులు ఊరిలోకి రాలేదు. వచ్చిన వాళ్ళు “టీ” కప్పుల్నీ, బొమ్మల్నీ చేతిలోకి తీసుకుని ముచ్చట పడుతున్నారు.

తనకి “టీ కప్పులు నచ్చడంతో, అవి మాత్రమే తీసుకుంది ఓ అరడజను. బడ్జెట్ని దృష్టిలో ఉంచుకుని.

వాటిని హాలులో ఉన్న టేబుల్ పైనే పెట్టింది. కొన్న, కొత్త వస్తువు భర్త వచ్చీరాగానే చూస్తాడని. చూసి .. మంచో, చెడో “ఓ” మాట అనేస్తే గుండె భారం దిగుతుందని.

వచ్చి .. అలాగే, చూసాడు.

“ఎంతేమిటి” అడిగాడు చేతుల్లోకి తీసుకుంటూ.

చెప్పింది. “ఎదురింటి సుబ్రహ్మణ్యంగారి భార్యా, ఆ పక్కింటి వసుంధరా తీసుకుంటుంటే తీసుకున్నా” వాళ్ళందరూ తీసుకున్నారు కాబట్టి, చవుక గానే వచ్చినయ్యన్నట్లు.

“ఫర్వాలేదు” అన్నట్లు నవ్వడంతో మనసు కుదుట పడింది.

అప్పటివరకూ “ఎక్కువ రేటు పెట్టేసావ్” అంటాడేమో అన్న సంశయం తొలగిపోవడంతో ఊపిరి పీల్చుకుంది.

భోజనాల తరువాత ..

అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకునే సమయంలో .. వాటిని చేతుల్లోకి తీసుకుంటూ “చక్కగా .. ముద్దుగా.. “కోపాల్లా” ఉన్నాయి కదండీ. రేపటి నుంచే అందరికీ వాటిల్లోనే కాఫీ ఇస్తాను” అంది వాటి వంక మురిపెంగా చూస్తూ.

పడకకుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్న ఋషేంద్రకి భార్య సంతోషం .. విసుగు తెప్పించింది.

“కోపాలేమిటి? కోపాలు .. పల్లెటూరి దానిలాగా. “కప్పులు” అనలేవా?” విసుక్కున్నాడు.

“అతనూ అలాగే, అమ్మాడు” చెప్పింది తనేం స్వంతగా కల్పించలేదన్నట్లు.

“వాడెలా అయినా అమ్ముకుంటాడు. వాళ్ళకి చదువా సంధ్యా. నీకైనా జ్ఞానం ఉండొద్దూ, ఇన్నాళ్ళ పాటు ఉద్యోగాల మీద ఊర్లు తిరుగుతున్నా, మంచి అలవడలేదు. పల్లెటూరిబైతంటను .. పల్లెటూరిబైతు” దుమదుమలాడాడు.

“అయ్యో! నేనేం అన్నాను. అతను అన్న మాటే చెప్పాను” బెదిరింది సుదిత.

అయినా ఆగలేదు ఋషేంద్ర “చదువు లేని దాన్ని కట్టబెట్టారని .. అందుకే తన జీవితం పైకి లేవడం లేదంటూ మొదలు పెట్టి ..” అంటూ చాలా దూరం వెళ్ళిపోయాడు. చెయ్యి కూడా చేసుకున్నాడు.

పుస్తకాలు ముందేసుకుని కూర్చున్న పిల్లలు ఖంగుతిన్నారు.

భర్త ఎప్పుడూ నవ్వుతాడో? ఎందుకు కోపం తెచ్చుకుంటాడో? అన్నాళ్ళ సంసారంలో ఆమెకు ఎప్పుడూ అవగతం కాదు.

ఇంటరూ, టెంతు చదువుతున్నా పిల్లలు ముగ్గురికీ తండ్రి అంటే భయమే. కోపం మితిమీరితే, పర్యవసానం తెలుసు కాబట్టి. తల్లికే నచ్చచెబుతారు వాళ్ళు “ఊరుకో .. అమ్మా ఊరుకో” అంటూ.

మొండివాడు రాజు కంటే బలవంతుడు.

తను వీధిలో వస్తువులు కొనడం ఏమిటి? ఇంట్లో ఇంత గొడవ జరగడం ఏమిటి? దాంతో సన్నగా గుండెల్లో నొప్పి మొదలయ్యింది.

అందుకే “మాత్ర మింగి పడుకుంది.

తను లేచేసరికే వంట పూర్తి అవడంతో తండ్రికి వడ్డిస్తుంది రెండో కూతురు “అద్విక”. ఇంట్లో ఆ పిల్లకే తండ్రి దగ్గర కాస్త చనువు.

ఋషేంద్రకి భోజనం చేసి ఆఫీసుకి వెళ్ళడం అలవాటు.

మూడో సంతానం కొడుకు “వికాస్”. వాడంటే వంశోద్ధారకుడని ఋషేంద్రకు వల్ల మాలిన అభిమానం.

పెళ్ళయిన కొత్తలో, బాగానే ఉండేవాడు. రోజులు గడిచే కొద్దీ, భర్త దృష్టిలో తనో చదువులేని మొద్దులా, పరిస్థితుల్ని అర్ధం చేసుకోలేని పల్లెటూరి దానిలా తయారయ్యింది. అలా అని అస్సలు చదువుకోలేదా! అంటే అదీ లేదు. అయిదవ తరగతి చదివింది.

వారపత్రికలూ, న్యూస్ పేపర్లూ చదవగలదు.

ఇంటి కొచ్చిన వాళ్ళకు కూరలూ, పచ్చళ్ళు పెట్టడంలో మెళకువలూ, అవసరమైన సలహాలూ ఇవ్వగలదు. అయితే, ఏం చేసినా భర్త ముందు .. అన్నీ దిగదుడుపే.

ఋషేంద్రకి అతిశయం ఎక్కువ.

ఆఫీసులో మాంచి హోదాలో ఉన్నందుకు క్రింది ఉద్యోగులు అణిగిమణిగి .. గడగడలాడుతూ ఉన్నట్లు .. ఇంట్లో భార్య ఉండడం లేదని.. పిల్లలకీ అలంటి గౌరవం అబ్బలేదని అనుకునేవాడు.

పిల్లలకి చనువిస్తే క్రమశిక్షణ లేకుండా పోతారని కట్టడిగానే ఉండేవాడు.

నవ్వుతున్నాడులే! మనిషి అనుకున్నా, చాప క్రింద నీరులా "నేను" అన్న అహం తొంగిచూస్తూనే ఉండేది.

ఎందుకులే అని అన్నిటికీ సర్దుకుపోతుంది. జీవితం అంటే, సర్దుకుపోవడమే కదా! అని. ఇప్పుడూ అంతే, భారంగా గడిచే రోజుని తలచుకుంటూ.

***

సుదతి, తల్లి మీనాక్షమ్మ ఎప్పుడైనా ..

చుట్టపుచూపుగా వచ్చిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో ఉండేవి సుధతికి. ఆ మీనాక్షమ్మ కూడా నెలో, రెండు నెలలో ఉండి విసుగొచ్చిన తరువాతే వెళ్ళేది.

మీనాక్షమ్మ ఉండడానికి "అర ఎకరం" స్వంతదారే అయినా, అది అంతా కొడుకు చేతుల్లోనే ఉండిపోవడంతో సాదా సీదానే ఉండేది. కట్టేది తెల్ల చీరేలే అయినా, బయటకి వెళ్ళినపుడు జరీ చీరే కావాలనుకునేది. నోరు తెరిచి, అడిగినా .. కోడలు ఓ జరీ చీరే కొనడానికీ ఇష్టపడేది కాదు.

ఎలా ఉన్నా, వస్తూ కూతురి చేతిలో కొంత "డబ్బు" పెట్టేది.

అత్తగారు వచ్చిన రోజు మాత్రం పలకరించేవాడు ఋషేంద్ర "ఎలా? ఉన్నారండీ?" అంటూ ఆ తరువాత మళ్ళీ వెళ్ళేటపుడే మాటలు.

నడుంనొప్పికీ, కంటి బాధకీ మందులు కావలిస్తే, వాళ్ళ ఊరిలో ఇంటికి వచ్చి చూసే .. ఆర్.ఎం.పీ డాక్టరుతో వ్రాయించుకున్న మందుల చీటీ కూతురుకిచ్చేది.

ఆ చీటీని చూస్తేనే విసుగు "వస్తే .. ఇదో సేవా" అన్నట్లు

"మనిషన్న తరువాత బాధలుండవా? ఇవిగోండి డబ్బులు .. అమ్మ ఇచ్చింది" అంటూ చేతిలో పెట్టేది. ఇదేమీ తెలియని మీనాక్షమ్మ అల్లుడే తెచ్చాడనుకునేది.

ఇంట్లో ఎవరైనా ఉన్నపుడు నివురుగప్పిన నిప్పు ఋషేంద్ర.

అదే భయం సుదితకు.

తల్లి వెళ్ళబోయే ప్రయాణం దగ్గరకు వస్తుందంటే .. దిగులు. భర్తకా పట్టింపు ఉండదు.

ఇంటికి వచ్చిన అత్తగారికి కనీస మర్యాదగా అయినా .. ఓ చీరే అయినా పెట్టాలని కూడా అనుకోడు. తన అల్లుడు మంచి ఉద్యోగస్తుడని అందరికీ గొప్పగా చెప్పుకుంటుంది.

అలాంటిది వట్టిగా పంపేస్తే .. పుట్టింటిలో, వదినగారి ముందు ఎంత తల వంపులో, అనుభవిస్తే గాని తెలీదు. అందుకే, ఇంటి గుట్టు బయటపడకుండా, ఏడ్చి .. అయినా సాధించాల్సి వచ్చేది.

అదే ..

ఋషేంద్ర తరుఫు వాళ్ళు ఎవరైనా వస్తే, ఆ ఆనందానికి పట్టపగ్గాలు ఉండేవి కాదు. వండే కూర దగ్గర నుంచి .. అన్నీ ఆరాలే. అవతలి వాళ్ళ ఇష్టాన్ని అనుసరించి ఏది కావాలంటే అదే వచ్చేది.

వెళ్ళేటపుడు బట్టలూ.

ఆ ఖర్చుని చూసి "నాన్న .. ఈ నెలలో తప్పక "అప్పు" చేస్తారమ్మా" అనేది వినతి. ఆ పిల్లకి అప్పుడప్పుడే వాస్తవం గ్రహింపుకు వస్తుంది.

ఓ సారి అలాగే, ఋషేంద్ర .. పెద్దమేనత్త వచ్చి, వెళిపోతుంటే ..

మేనత్త చెబితే అన్నా తన పోకడ తగ్గించుకుని మారుతాడని "అస్తమానం విసుక్కుంటూనే ఉంటారు పిన్నిగారూ! నేనో తెలివితక్కువదాన్నని కోపం తెచ్చుకుంటారు. పెళ్ళయి ఇరవై ఏళ్ళు దాటిపోయినా .. పిల్లలు పెళ్ళీడు కొచ్చినా ..ఇంకా దేనికో దానికి "అంటూనే" ఉంటారు" అని.

మేనల్లుడు కోపధారి మనిషి అని తెలిసినా ..

రాత్రి భోజనాల తరువాత ...

"ప్రతిదానికీ అంత కోపం తగదురా, బాబూ! అమ్మాయి మాటెలా ఉన్నా .. పిల్లలు కూడా నువ్వంటే భయపడుతున్నారు" అంటూ చెప్పబోయింది.

మేనత్త మాటల్లో శ్లేష ఏదో కనిపించింది ఋషేంద్రకి.

"నేను ఎవరిని ఏమంటున్నానని ? అది నీకు "ఏదో" నూరిపోసింది, అందుకే నువ్వలా వెనకేసుకు వస్తున్నావు" అంటూ మొహం ముడుచుకున్నాడు.

మేనత్త ఇంకేదో మాట్లాడబోయింది.

ఆ మాటలు రుచించలేదు. పైగా అత్తయ్యని వెంటబెట్టుకుని, వచ్చిన వరసకు తమ్ముడి "సోమశేఖరం" .. ముందు తను దోషిగా నిలబడే "అవమానం" అంతా ఇంతా కాదు.

అహం పొడుచుకొచ్చి .. ముఖం జేపురిమ్చింది.

"దీనికి ఎంత పొగరు అనుకున్నావు అత్తయ్యా! దీని దృష్టిలో నేనో వెంట్రుక ముక్కని. వాళ్ళ వాళ్ళు మనకంటే ఆస్తిపరులని కండకావరం. అందుకే నోటికి వచ్చినట్లు పేలుతుంది. దీన్ని ఇలా వదిలేస్తే కాదు. ఇప్పుడే బుద్ధి చెప్పాలి" అంటూ కూర్చున్న పడక కుర్చీలోంచి లేస్తూ సుదిత మీదకు లేచాడు.

ఆ హటాత్పరిణామానికి కంగారు పడిన మేనత్త "ఒరే! బాబూ .. ఋషీ, ఏం పనిరా, ఇది? మీ నాన్నకి ఉన్న కోపమే నీకూ వచ్చినట్లుంది" అంటూ అడ్డుకోబోయింది.

అనవసరంగా తను గొడవకు కారణం అయ్యానన్న ఆత్మన్యూనత ఆమెలో చోటుచేసుకుని.

ఎదురుగా ఉన్న సుదతి జుట్టు దొరక బుచ్చుకుని వంచి వీపు మీద .. నాలుగు బాదులు బాదాడు.

"అమ్మో! అయ్యో! "అంటూ హాహాకారాలు చేసింది సుదిత.

సుదితతో పాటు పిల్లలూ పెద్దపెట్టున ఏడుపు లంఖించుకున్నారు. ఏడుపులూ, పెడబొబ్బలు. ఎంత రాద్ధాంతం జరగాలో అంతా జరిగిపోయింది.

చుట్టుప్రక్కల వాళ్ళు, వాళ్ళ ప్రహరీల దగ్గర చేరిపోయారు.

వచ్చినావిడ వెళ్ళిపోయినా ..

ఆ దెబ్బలకి వారం రోజులకి గాని మనిషి కాలేదు సుదిత.

ఆరోజు నుంచీ వినతి తండ్రితో మాట్లాడం మానేసింది.

***

కాలక్రమంలో పిల్లలందరూ ఉద్యోగాలు చూసుకుని, పెళ్ళిళ్ళు చేసుకుని .. అందరూ హైదరాబాదు వెళ్ళిపోగా .. ఇంటిలో వృద్ధాప్యంతో సుదతీ .. ఋషేంద్రా మిగిలిపోయారు.

డెబ్బయి ఏళ్ల వయసులో కూడా ఋషేంద్ర పట్టుసడలలేదు.

అర్థం పర్థం లేని వాదనలతో రోజు గడిచేది.

అలాంటి క్రమంలోనే గుండెపోటుతో సుదతి ఓ తెల్లవారుజామున కన్నుమూసింది.

***

తల్లి పోయిన తరువాత .. ఇల్లు అమ్మేయ్యమన్నాడు కొడుకు.

ఆ ప్రతిపాదన నచ్చలేదు ఋషేంద్రకి. తనుండగా ఇల్లు అమ్మడం ఇష్టంలేదు.

ఇంత సంపాదించుకుని అవసానదశలో ఇల్లు కూడా లేకపోతే, తను దిక్కులేని, వాడైపోతాడన్న ఆలోచన పట్టుకుంది.

ఇన్నాళ్ళూ తెలీలేదు గానీ, భార్య పోయిన తరువాత ఏదో తెలియని అభద్రతా భావం వెంటాడుతుంది.

కోడలు తెలివితేటలు తెలిసినవే. ఉన్నది ఒక్కడే కొడుకు కాబట్టి, ఆ ఇల్లు తమకే రావాలని ఆమె ఆశ. ఎందుకంటే, తమకి ఉన్నది ఇద్దరూ ఆడపిల్లలు గనుక.

అందుకే పిల్లలు అందరికీ దాని మీద "సమానహక్కు" కలిగి ఉండేలా .. తన తరువాత అమ్మి, అందరూ సమానంగా పంచుకునే విధంగా "విల్లు" వ్రాసి .. సామాను అంతా ఒకగదిలో పెట్టి, మిగిలిన ఇల్లు అద్దెకు ఇచ్చేసి, కొడుకు వికాస్ దగ్గరకు వెళ్ళిపోయాడు.

కోడలు .. కొడుకు ఉంటే ఒకలాగా, లేకపోతే ఒకలాగా ఉండేది. తను భోజనానికి కూర్చోగానే పొరుగిళ్లకు పెత్తనాలకు వెళ్ళిపోయేది. తనే వడ్డించుకు తినాలి.

ఉదయం చేసిన కూరలు సాయంత్రానికీ ఉంచేసేది. చల్లటి పదార్థాలు తినడం ఋషేంద్రకి కష్టంగా ఉండేది. భార్య ఉండగా అన్నీ జరిగాయి.

అదే అంటే ..

"రోజంతా వంటలేం చేస్తూ కూర్చోను మామగారూ" అనేది. అప్పుడప్పుడూ హోటల్ నుంచి కూరలు తెప్పించేది. ఆ మషాళాలు సరిపడేవి కాదు ఋషేంద్రకి.

విల్లు విషయం కొడుక్కి నచ్చకపోతే, కోడలికి నచ్చుతుందా?

***

తనతో మనసు విప్పి మాట్లాడేది అద్విక అని, ఆమెతోనే ఎక్కువ సంభంధాలు పెట్టుకునేవాడు. అయితే, ఆమె భర్త ఎప్పుడో గాని పలకరించేవాడు కాదు.

భరించుకోక తప్పదు ఇప్పుడు తన జీవితం తన చేతుల్లో లేదు.

అద్వికకు ఎందుకనో బద్ధకం అలవాటయ్యింది. ఆఫీసు ఉన్నా బారెడు పొద్దెక్కిన తరువాతే, నిద్ర లేస్తుంది. లేచి ఆదరాబాదరాగా తయారయ్యి వెళుతుంది.

ఎనిమిది దాటితే గాని, కాఫీ అందేది కాదు.

జీవితానుభవం అన్నిటికీ సర్దుకుపోవడమే నేర్పిస్తుంది.

వినతిది కాస్త ముక్కు సూటి వ్యవహారం. ఎప్పుడూ తల్లిని వెనకేసుకుని వచ్చేదని, తనకే కాస్త కినుక. అయినా కంపెనీ నుంచి వచ్చి కూడా, రెండు పూటలా వేడిగానే పెట్టేది.

ఇలాంటి నేపథ్యంలో ..

ఓసారి అక్కతో ఫోన్లో మాట్లాడుకుంటూ అద్విక అంది "అక్కా! నాన్నగారు ఇప్పుడు చాలా బాధపడుతున్నారు. మీ అమ్మని "ఇంకాస్త" బాగా చూసుకుంటే, "ఇంకాసిన్ని" ఎక్కువ రోజులు బ్రతికి ఉండేది రా! అని. ఆ మాట అంటుంటే నాకూ చాలా బాధేసింది" చెప్పింది తండ్రి పట్ల ఉన్న తన అభిమానాన్ని వ్యక్త పరిచేలా.

అలాంటి మాట అనుకోవడమే వినతికి నచ్చలేదు. జరగలేనివి జరుగుతాయా? పోయిన మనిషి తిరిగి వస్తుందా? అనవసరపు సానుభూతి మాటలు ఎందుకు ఉపయోగం పడతాయి?

అస్సలు తల్లి ప్రస్తావనే తీసుకురాదు తను తండ్రి దగ్గర.

"అంటారు మరి. వినేవాళ్ళు ఉంటే ఎన్నయినా అంటారు. నీతో అన్నారు గాని, అదే మాట నాతో అయితే అనేవారా!" కోపం తెచ్చుకుంది.

అక్కడే ఉన్న ఋషేంద్రకి ఆ సంభాషణల సారం అర్థం కాకపోయినా, పెద్దకూతురు ఎందుకో గట్టిగా మాట్లాడుతుందనీ తెలుసుకోవడానికి ఎంతో సేపు పట్టలేదు.

ఎందుకూ? ఏమిటీ? అనే ధైర్యమూ లేదు.

ఎందుకంటే .. జీవితం అందుబాటులో ఉన్నప్పుడు విద్వేషాలు, విభేదాలతో గడిచింది.

చదువూ, తెలివితేటలు ఉండి కూడా, మూర్ఖత్వంగా ప్రవర్తించాడు. గడిచిపోయిన కాలం తిరిగి రాదన్నది తెలిసిందే. తన జీవితం ఇప్పుడు తన చేతుల్లో లేదు.

ఒక్క సర్దుకుపోవడం తప్ప.

*** **** ***

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

New Jersey, USA

## TriMurthy Day CELEBRATIONS

# Save the Date

MARCH
12 SUN
2023



**Venue:**
Ananda Mandir
269 Cedar Grove Lane,
Somerset, NJ 08873

**For additional information:**

Madhu Rachakulla: (201) 312 1305
Anu Dasari: (908) 907 1502
Ravi Annadanam: (917) 355 5503
Srinivas Cheruvu: (732) 447 6686
Bindu Yalamanchili: (908) 240 3167
Sudha Devulapalli: (732) 331 9313
Jyothi Kamarasu: (609) 578 8606
Venkata Satya Tata: (973) 985 3409
Naga Mahendar Velishala: (732) 429 6025
Jaya Chikka: (201) 317 1166
Bhanu Rekha Brahmasamudram: (732)-5130716

# నేస్తాలు

శింగరాజు శ్రీనివాసరావు

"పిల్లలూ నేను చెప్పింది అర్థమయింది కదా. రేపు అందరూ ఒకటి నుంచి పదివరకూ ఎక్కాలు నేర్చుకుని రావాలి. రోజు వల్లెవేయిస్తున్నా రానివాళ్ళు ఇంటిదగ్గర నేర్చుకుని రావాలి. ఎవరిని ఎప్పుడు ఏ ఎక్కము అడుగుతానో చెప్పలేను. కాబట్టి అందరూ నేర్చుకుని రావాలి. సరేనా"

"సరే సర్" రామనాథయ్య మాష్టారు చెప్పిన మాటకు కోరస్ గా సమాధానం చెప్పారు పిల్లలు.

"సరే..ఇక ఇంటికి పదండి" అని తన సంచి తగిలించుకుని బయటకు వచ్చాడు బడిపంతులు రామనాథయ్య.

వాకిలి బయట నిలుచుని ఉన్నాడు ఓ ఏడేళ్ళ కుర్రాడు. ఈరోజే కాదు గత వారం నుంచి ఇదే తంతు. తనను చూడగానే పరిగెత్తే కుర్రాడు ఈరోజు ఏదో కళ్ళు మూసుకుని నెమరువేసుకుంటున్నాడు. వంటి మీద చొక్కా లేదు. చినిగిన నిక్కరు మాత్రమే వేసుకున్నాడు. దగ్గరగా వెళ్ళాడు రామనాథయ్య. అతని అడుగుల శబ్దం విన్నాడేమో కళ్ళుతెరిచి భయంభయంగా చూశాడా కుర్రాడు.

"ఎవరబ్బాయ్ నువ్వు. ఎందుకిలా బయటే నిలబడి ఉన్నావు" అడిగాడు రామనాథయ్య.

"నేను..నేను..." వణికిపోతున్నాడు ఆ కుర్రాడు.

"భయపడకు. నిన్నేమీ అనను. నువ్వు ఎందుకు నిలబడ్డావో చెప్పు" అనునయంగా అడిగాడు.

"నాకు..నాకు..సదువుకోవాలని ఉందయ్యా" ఎక్కడో నూతిలో నుంచి వచ్చినట్లుగా ఉంది మాట.

ఒక్కక్షణం ఆశ్చర్యపోయాడు రామనాథయ్య. ఈ వయసులో పిల్లలు బడికి రామని చెప్పి మారాం చేస్తారు. మరి వీడేంటి.. అని ఆలోచిస్తున్నంతలోనే..

"ఒరేయ్..సుబ్బిగా ఈడున్నావా. ఎతకలేక సత్తున్నారా. రోజు ఈడేం పనిరా నీకు. పద ఇంటికిబోదాం" అంటూ వచ్చిన సింగడు రామనాథయ్యను చూసి "దండాలు సామీ. ఈడికి ఎంతసెప్పినా ఇనటంలేదు. గొడ్లను తోలకపోరా అంటే, ఆటిని బీడుకాడ వొగ్గేసి ఈడకొచ్చి కూసుంటాడు. ఆడికెందుకురా అంటే 'అయ్యా.. నే సదువుకుంటానే' అంటాడు. తవరే సేప్పండి సామీ. ఊరి బయటే గానీ, ఊల్లోకి అడుగెట్టనికి పనికిరానోల్లకి సదుపెందుకు. ఏదో సేనులో కూలీసేసుకుంటా, గొడ్లకాసుకుంటా ఉండాలె గానీ" అన్నాడు సింగడు.

"ఏందిరా సింగా..నీ కొడుకు చదువుకోవాలని అడుగుతున్నాడా. అందుకని ఇక్కడికొచ్చి బయట కూర్చుని నేను చెప్పేది వింటున్నాడా. ఆశ్చర్యంగా ఉందిరా.

ఒరే..సుబ్బా..నువ్వు వారం నుంచి ఇక్కడే వేలాడుతున్నావు కదా. నేను చెప్పింది ఏం నేర్చుకున్నావో చెప్పు" అని అడిగాడు రామనాథయ్య.

తలవంచుకున్నాడు సుబ్బిగాడు.

"ఆడికేమొస్తదయ్యా నా బొంద. పని ఎగ్గొట్టడానికి ఇట్టా సేత్తున్నాడు" అందుకున్నాడు సింగడు.

తండ్రి వైపు ఉరిమిచూశాడు సుబ్బడు. వాడి అహం దెబ్బతిన్నది. పని తప్పించుకోవడానికి అన్నమాట వాడికి నచ్చలేదు.

రామనాథయ్య వైపు చూసి "నేను ఎక్కాలు నేర్సుకున్నా సారూ" అన్నాడు ఉడుక్కుంటూ.

"ఏసిన ఏసాలు సాలు పదరా" అంటూ సుబ్బడి చెయ్యిపట్టుకుని లాక్కుపోబోయాడు. వాడు విదిలించుకున్నాడు.

"నువ్వు ఆగరా సింగా..ఒరేయ్ సుబ్బా నువ్వు చెప్పరా ఎక్కాలు" అన్నాడు వాడి భుజం మీద చెయ్యి వేసి.

"సామీ..మేము అంటరానోల్లం. ఆణ్ణి తాకమాకండి" అంటూ సుబ్బడిని పక్కకు లాగాడు సింగడు.

"అవన్నీ తరువాత. ముందు నువ్వు ఏం నేర్చుకున్నావో చెప్పరా" అనగానే తను విని నేర్చుకున్న ఎక్కాలను గడగడా చెప్పేశాడు సుబ్బడు. వాడి తెలివితేటలకు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు రామనాథయ్య. ఇక సింగడి

పరిస్థితి చెప్పడానికే లేదు. వాడికంతా అయోమయంగా ఉంది.

"శభాష్ రా సుబ్బా. మట్టిలో పుట్టిన మాణిక్యంరా నువ్వు. ఒరేయ్ సింగా. నీ కొడుకును రేపటి నుంచి బడికి పంపు. సర్పంచిగారితో నేను మాట్లాడుతాను. మనిషికి అంటరానితనముందేమో గానీ, చదువుకు లేదురా. చదువు మీద ఇంత ప్రేమ ఉన్నవాడికి చదువు చెబితేనే నాలాంటి గురువులకు తృప్తి, విలువ. ఇదిగో ఈ ఇరవై రూపాయలు తీసుకో. వాడికొక చొక్కా కుట్టించి రేపటి నుంచి బడికి పంపు. పలక, బలపం నేను తీసుకువస్తాను" అని సింగడి చేతిలో డబ్బులు పెట్టాడు.

"సామీ..మీరిట్టా సేత్తే ఊళ్లో వాల్లు ఊరుకోరయ్యా" భయపడుతూ చెప్పాడు సింగడు.

"చెప్పే విధంగా చెప్తాను సరేనా" అని సింగడికి అభయమిచ్చి "ఒరేయ్ సుబ్బా..రేపటి నుంచి స్కూలుకు రా. నువ్వెంత వరకూ చదువుకోవాలనుకుంటే అంతవరకూ చదివిస్తాను. నువ్వు నా ప్రియశిష్యుడివి" అని సుబ్బడి భుజంతట్టి బయలుదేరాడు రామనాథయ్య.

*****

"మాష్టారూ..ఏ లోకంలో ఉన్నారు. నన్ను ఆశీర్వదించండి" అంటూ కాళ్ళకు మ్రొక్కుతున్న సుబ్బారావును మనసారా దీవించాడు రామనాథయ్య.

సుబ్బడి కోసం సర్పంచికే ఎదురుతిరిగాడు తను. అంటరానివాళ్ళని ఎవరినైనా పక్కనబెడితే పోలీసులు కేసు పెట్టి కృష్ణజన్మస్థానానికి పంపుతారని, చట్టాన్ని విడమరిచి చెప్పాడు. దాంతో భయపడ్డ సర్పంచి సరేనన్నాడు. తరువాత తరువాత ఊరి వారిలో మార్పు వచ్చింది. సుబ్బడు క్రమంగా గురువు గారి శిక్షణలో తర్ఫీదు పొంది అయిదవ తరగతి విద్యార్థులకు జరిగిన క్విజ్ పోటీలో జిల్లాలోనే ప్రథమంగా నిలిచాడు. జిల్లా కలెక్టరు ఆ ఊరికి రావడం, సర్పంచి చొరవను, రామనాథయ్య కృషిని, సుబ్బడి పట్టుదలను పొగడడంతో ఊరు ఊరంతా చాలా గర్వంగా ఫీలయ్యారు. ఆ సందర్భంగా కలెక్టరు అడిగిన ప్రశ్నకు సుబ్బడు జంకు లేకుండా "సారూ..నాకూ మీలా కలెక్టరు కావాలని ఉంది" అని చెప్పడంతో ముచ్చటపడ్డాడు కలెక్టరు. సుబ్బడి చదువుకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని, కాకపోతే ఆ కుర్రాడు ఎక్కడా తప్పకుండా అన్ని పరీక్షలలో ప్రథమశ్రేణులే తెచ్చుకోవాలని షరతు విధించాడు. దానికి సుబ్బడు, రామనాథయ్య ఇద్దరూ అంగీకరించారు. పదవ తరగతి పరీక్షలు జరిగేటపుడు జబ్బుచేసి సింగడు మరణించాడు. తండ్రి మరణం వాడి చదువుకు ఆటంకమవుతుందేమోనని భయపడ్డాడు రామనాథయ్య. కానీ సుబ్బడు జంకలేదు. దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్షలు వ్రాసి జిల్లాలోనే ప్రథమ ర్యాంకు సాధించాడు. గురువు మాట వమ్ముకాకుండా అతని పర్యవేక్షణలో చదువును కొనసాగిస్తూ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సును పూర్తిచేశాడు సుబ్బడు ఉరఫ్ సుబ్బారావు. ఇక మిగిలింది కలెక్టరు కావాలనే సుబ్బారావు ఆశయం. అందుకోసం శిక్షణకని బయలుదేరుతూ గురువుగారి వద్ద ఆశీర్వాదం తీసుకోవాలని హాస్టలు నుంచి వచ్చాడు.

"మాష్టారూ..రేపటినుంచి ఒక మూడు నెలలు శిక్షణ ఇస్తారు. ఆ తరువాత పరీక్షలు జరుగుతాయి. ప్రిలిమ్స్ అయిన తరువాత మరల ఫైనల్ పరీక్షలకు మరో నెల రోజులు శిక్షణ ఇస్తారు. భగవంతుడి దయవలన ర్యాంకు వస్తే వెంటనే ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇస్తారు" వివరంగా చెప్పాడు సుబ్బారావు.

ఇంతలో కాఫీ తీసుకువచ్చింది రామనాథయ్య కూతురు అనుపమ.

" బాగున్నావా అమ్మా. గుర్తున్నానా" కాఫీ తీసుకుంటూ పలకరించాడు సుబ్బారావు.

"అదేంటన్నయ్యా అలా అడిగారు. నాన్నగారు మీ గురించి తలచుకోని క్షణం ఉండదు. తన శిష్యులందరిలోకి మీరు ప్రియాతిప్రియమైన శిష్యుడు. నాన్న ఆశయాలను నిలబెట్టేది మీరేనని నాన్న గర్వపడుతుంటారు" చెప్పింది అనుపమ.

"ఎటో కొట్టుకుపోవలసిన నన్ను మనిషిని చేసి నిలబెట్టింది

మాస్టారు గారేనమ్మా. నా చర్మం వలిచి చెప్పులు కుట్టించినా ఆయన రుణం తీర్చుకోలేను. ఆయన పెట్టిన భిక్షే కదమ్మా ఈ చదువు. ఆయన నాకు గురువే కాదమ్మా, తండ్రి, ఒక మార్గదర్శి. ఆయన చెప్పినట్లు చదువును ప్రేమించానమ్మా. అదే నన్ను ఈరోజు నా ఆశయం నెరవేరేలా చేసింది. అవును తల్లీ..ఇంతకూ నువ్వు ఏంచేస్తున్నావు.
మాస్టారూ..అమ్మాయికి సంబంధాలేమైనా చూస్తున్నారా" అడిగాడు సుబ్బారావు.

" లేదయ్యా..ఇక మొదలుపెట్టాలి. అప్పటిదాక ఖాళీగా ఉండడమెందుకని తనకు ఇష్టమైన మొక్కల పెంపకాన్ని చేపట్టి, ఒక చిన్న నర్సరీ నడుపుతున్నది" చెప్పాడు రామనాథయ్య.

"నాకు ఇష్టమని కాదన్నయ్యా. నాన్నగారు చెప్పినట్లు ' ప్రేమకు కాదేదీ అనర్హం'. అందుకే మనిషికి ప్రాణవాయువును అందించే మొక్కలను ప్రేమిస్తున్నాను. ఉచితంగా కాకున్నా లాభాపేక్ష లేకుండా మొక్కలను అందరికీ అందిస్తున్నాను. మన ఊరిలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సగం ధరకే మొక్కలను సరఫరా చేశాను. పేరు నాదే గానీ, వెనుక ఉండి నడిపించిందంతా నాన్నే" చెప్పింది అనుపమ.

"మంచి పని చేస్తున్నావమ్మా. పర్యావరణ పరిరక్షణలో భాగమేగా అది. మాష్టారూ..మరి నేను వెళ్ళిరానా. రేపు నాకు దేవుడి దయవల్ల ఉద్యోగం వస్తే, మీ సమక్షంలోనే నేను ఛార్జి తీసుకుంటాను. దయచేసి ఆరోజు వచ్చి మిమ్మల్ని తీసుకు వెళతాను. కాదనకండి. వస్తానమ్మా" అని వాళ్ళ వద్ద సెలవు తీసుకుని బయలుదేరాడు సుబ్బారావు.

*******

ఆ రోజు సుబ్బారావు జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించే రోజు. అనుకున్న మాట ప్రకారం అనుపమతో సహా ఆ కార్యక్రమానికి హాజరయ్యారు రామనాథయ్య గారు.

సుబ్బారావు కోరిక మేరకు ఆఫీసు హాలులోనే ఫంక్షను ఏర్పాటు చేయించారు కలెక్టర్ గురుదేవ.

" మన జిల్లాకు క్రొత్త జాయింట్ కలెక్టర్ గా పోస్టు చేయబడిన సుబ్బారావు గారి కోరిక మేరకు ఈ చిన్న సమావేశం ఏర్పాటు చేశాను. సాధారణంగా ఆర్డరు తీసుకోవడానికి తండ్రిని తీసుకుని వస్తారు ఎవరైనా. కానీ సుబ్బారావు గారికి తండ్రి, గురువు, దైవం అన్నీ రామనాథయ్య గారేనని చెప్పి, ఆయన చేతుల మీదుగా తన ఆర్డరు తీసుకుంటానని చెప్పి నన్ను ఒప్పించి మరీ ఈసమావేశం ఏర్పాటు చేయించారు. నేను కాదనలేక పోయాను. సుబ్బారావు గారి జీవితంలో రామనాథయ్య గారికున్న ప్రాముఖ్యత తెలిశాక, అతని కోరిక సబబేననిపించింది. ఇప్పుడు రామనాథయ్య మాస్టారు గారు వేదిక మీదకు వచ్చి తన చేతుల మీదుగా ఈ అప్పాయింట్మెంట్ ఆర్డరును సుబ్బారావు గారికి అందజేయవలసినదిగా కోరుతున్నాను" అని చెప్పి రామనాథయ్యను వేదిక మీదకు ఆహ్వానించాడు గురుదేవ.

తన చేతుల మీదుగా సుబ్బారావుకు కవరు ఇస్తున్నప్పుడు అప్రయత్నంగా రామనాథయ్య కంటిలో ఆనందభాష్పాలు ఉప్పొంగాయి. అక్కడ ఉన్న వారంతా అభ్యర్థించడంతో కాదనలేక మైకు అందుకున్నాడు రామనాథయ్య.

"అందరికీ నమస్కారం. తండ్రికి బిడ్డ ఎదుగుదల ఎంత ఉత్సాహాన్ని ఇస్తుందో, ఈరోజు సుబ్బారావు ఎదుగుదల నాకు అంతటి సంతోషాన్ని ఇస్తున్నది. ప్రతి గురువు జన్మ ధన్యమయ్యేది శిష్యుడు తనను మించి ఎదిగాడని తెలిసినపుడే. నిజానికి ఇందులో నేను చేసింది ఏమీలేదు. పసితనంలో సుబ్బారావుకు చదువు మీద ఉన్న శ్రద్ధను గమనించాను. మంచి వృద్ధిలోకి రాగలడని అనిపించింది. సరస్వతీదేవికి కులమతాలు లేవని నమ్మినవాడిని గనుక, అతడిని ప్రోత్సహించాను. అతడికి చదువు మీద ఉన్న ప్రేమే అతడిని ఇంతవాడిని చేసింది. మా గురువుగారు చెప్పేవారు.

"కుల,మతాలను ప్రేమించకు. అవి నీలో విషబీజాలను నాటుతాయి. సాటి మనిషిని, పశుపక్ష్యాదులను ప్రేమించు. నీలో మానవత్వం పెరుగుతుంది. మొక్కను ప్రేమించు. అది తరతరాలకూ నీడనిస్తుంది. చదువును ప్రేమించు. అది నీకు నీడగా, తోడుగా నిలిచి పదిమందికి వెలుగును చూపే మహాత్ముడిని చేస్తుంది" అనేవారు. అదే నేను సుబ్బారావుకు చెప్పాను. తను ఆచరించాడు. అంతే జరిగింది. మనిషికి అక్షరం ఒక వరం. పుస్తకం ఒక నేస్తం. ఈ సందర్భంగా నేను కలెక్టరు గారిని కోరుకునేది ఒకటే. అంతర్జాల మహిమలో పడి నేటి యువతరం పుస్తకాన్నే మర్చిపోతున్నారు. వారు తిరిగి పుస్తక నేస్తాలుగా మారాలంటే, పాఠశాలలో గ్రంథాలయాన్ని విధిగా ఏర్పాటు చేయాలి. అలాగే ప్రతి విద్యార్థి విధిగా ఒక గంటపాటు గ్రంథాలయంలో గడిపేలా చూడాలి. జిల్లాలోని గ్రంథాలయాల సంఖ్య పెంచడమే కాక, ఎక్కువ పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలి. ఇది ఒకనాటితో జరిగే పని కాదు. అందరూ సహకరించాలి. గురువులు బాధ్యతగా స్వీకరించి విద్యార్థులకు పుస్తకం విలువ తెలియజేయాలి. అయిదువేళ్ళు కలిస్తేనే పిడికిలికి బలం. మేధావులంతా కలిస్తేనే సమాజానికి బలం. విద్యార్థులు చైతన్యమైతేనే గ్రంథాలయాలకు ఊపిరి. నా శిక్షణలో పెరిగిన సుబ్బారావు ఈ పనిని సక్రమంగా నిర్వర్తించగలడని ఆశిస్తున్నాను. పుస్తకానికి తిరిగి వైభవం వస్తేనే తరతరాల చరిత్రలు తిరిగి జీవం పోసుకుంటాయి. మహానుభావుల జీవితగాథలు చదివి విద్యార్థులు చైతన్యవంతులు కావాలి. విద్యార్థులంతా పుస్తకనేస్తాలుగా మారాలి. అక్షరం అజరామరమై వెలగాలి. నా కోరిక అసమంజసం కాదని అనుకుంటాను. పెద్దమనసుతో ఆలోచిస్తారని ఆశిస్తున్నాను. నిజానికి ఇది కొత్త కార్యక్రమం కాదు. మనం వదిలిపేసిన పద్ధతి. మేము చదువుకునే రోజులలో ప్రతి చిన్న ఊరిలోనూ గ్రంథాలయం ఉండేది. మా పాఠశాలలో అసెంబ్లీ జరిగిన తరువాత ఎవరో ఒక విద్యార్థిని పిలిచి మా ప్రధానోపాధ్యాయుల వారు ఆ రోజు పత్రికలోని ముఖ్యాంశాలను అందరికీ చదివి వినిపించమని చెప్పేవారు. నాగరికత పెరిగి, అధునాతన సెల్ ఫోనులు చేతికి రావడంతో, ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. కానీ మనుషుల మధ్య, మనసుల మధ్య దూరం పెరిగింది. అసలు పాఠశాలలో అసెంబ్లీ అనేదే కనుమరుగయిపోయింది. జాతీయగీతాలాపన కూడ మర్చిపోయాము. దయచేసి కనీస ప్రభుత్వ పాఠశాలలోనైనా విద్యార్థులకు దేశభక్తిని, పుస్తకపు విలువను తెలిపే కార్యక్రమాలను ప్రవేశపెట్టండి. ఇది ఈ దేశ పౌరుడిగా నా విన్నపం. తప్పులుంటే మన్నించండి. అందరికీ సెలవు" అని అందరికీ నమస్కరించి వేదిక దిగి వచ్చాడు రామనాథయ్య.

"పూజ్యులైన మా గురువు గారికి, తదితర పెద్దలకు నా నమస్కారములు. మట్టి తట్ట తప్ప మరేదీ తెలియని నాకు చదువు విలువను చెప్పి నాలో దాగిన చదువుకోవాలనే కోరికకు నీరుపోసి పెంచి, పూలుపూయించి, దాని ఫలాన్ని పొందేలా  చేసిన మా గురువు గారి ఆశయం తీర్చడం నా ధర్మంగా భావిస్తున్నాను. అంతే కాదు ఒక బాధ్యతగల అధికారిగా, అడుగంటుతున్న గ్రంథాలయాల వైభవాన్ని తిరిగి పునఃప్రతిష్టించడానికి ప్రయత్నిస్తాను. దీనికి ప్రభుత్వసాయం, పై అధికారుల మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నాను. ఇది మీకు నేనిచ్చే గురుదక్షిణే కాదు మాస్టారూ, ఒక పౌరుడిగా నా బాధ్యత" అంటూ రామనాథయ్య పాదాలకు వంగి నమస్కరించాడు సుబ్బారావు.

అందరి కరతాళధ్వనుల మధ్య సుబ్బారావును మనసారా ఆశీర్వదించాడు రామనాథయ్య.

***** ******

# తెలుగు సమితి శ్రద్ధాంజలి

## పద్మశ్రీ K. విశ్వనాథ్

**ఓ కళా తపస్వీ..**
**సాంప్రదాయ సంగీతానికి శంకరాభరణం తొడిగావు**
**భారతీయ నృత్యానికి తెర పై సిరిసిరి మువ్వ కట్టావు**
**అశ్లీలం, అసభ్యత లేని శుభప్రదమైన చిత్రాలను అందించి**
**తెలుగు చిత్ర రంగానికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చావు**
**మీకు శ్రద్ధాంజలి..**



ప్రముఖ దర్శకులు, కళాతపస్వి, దాదాసాహేబ్ ఫాల్కే అవార్డు గ్రహీత కె. విశ్వనాథ్ ఫిబ్రవరి 2 2023, గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. విశ్వనాథ్ గారి స్వస్థలం గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని పెదపులివర్రు గ్రామం. 1930 ఫిబ్రవరి 19న జన్మించారు. బాల్యం, ప్రాథమిక విద్య పెదపులివర్రు లోనే గడిచినా, ఉన్నత పాఠశాల విద్య అంతా విజయవాడలోనూ, కాలేజీ విద్య గుంటూరు హిందూ కాలేజీ, ఏసీ కాలేజీల్లో కొనసాగింది. బీఎస్సీ డిగ్రీ చేశారు. తల్లిదండ్రులు కాశీనాథుని సుబ్రహ్మణ్యం, సరస్వతమ్మ. విశ్వనాథ్ కు ముగ్గురు పిల్లలు పద్మావతి దేవి, నాగేంద్రనాథ్, రవీంద్రనాథ్.

చెన్నైలోని ఓ స్టూడియోలో సౌండ్ రికార్డిస్టుగా సినిమా జీవితాన్ని మొదలుపెట్టిన శ్రీ  కె. విశ్వనాథ్ గారు  అక్కినేని నాగేశ్వరరావు హీరోగా నిర్మించిన ఆత్మ గౌరవం సినిమాతో దర్శకుడిగా మారారు. ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది బహుమతి లభించింది. శ్రీ కె విశ్వనాథ్ మొత్తం 60 సినిమాలకు దర్శకత్వం వహించారు. శంకరాభరణం, సాగరసంగమం, స్వర్ణకమలం, సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి, శుభలేఖ, ఆపద్బాంధవుడు, శుభసంకల్పం వంటి ఎన్నో క్లాసికల్స్ అందించారు. అలాగే, నటుడి గానూ ఎన్నో గొప్ప పాత్రల్లో కె. విశ్వనాథ్ గారు జీవించారు. శంకరాభరణానికి జాతీయ పురస్కారంతో పాటు సప్తపదికి జాతీయ సమగ్రతా పురస్కారం లభించింది. స్వాతిముత్యం సినిమా 1986లో ఆస్కార్ అవార్డుకు అధికారికంగా ప్రవేశం పొందింది. భారతీయ సినిమాకు చేసిన సమగ్ర సేవకు గాను విశ్వనాథ్ గారికి  భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారమిచ్చి గౌరవించింది. 2016లో విశ్వనాథ్ గారిని దాదాసాహేబ్ ఫాల్కే అవార్డు వరించింది.

భారతీయ సంస్కృతికి చిహ్నమైన శాస్త్రీయ కళలను తన కథలుగా మలుచుకొని, అద్భుతమైన కావ్యాలను తెరకెక్కించి కళాతపస్వి అనిపించుకున్న శ్రీ విశ్వనాథ్ గారి మృతిపై తెలుగు కళా సమితి కార్యవర్గం  విచారం వ్యక్తం చేశారు.  ఆయన  ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## పద్మవిభూషణ్ వాణీ జయరాం

ప్రముఖ నేపథ్య గాయని వాణీ జయరాం(78) చెన్నైలోని తన స్వగృహంలో 2023  ఫిబ్రవరి 4 తేదీన శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు.



తమిళనాడులోని వెల్లూరులో 1945 నవంబర్ 30న  దురైస్వామి, పద్మావతి దంపతులకు జన్మించిన వాణీ జయరాం అసలు పేరు కలై వాణి.

విధి చేయు వింతలన్నీ, ఎన్నెన్నో జన్మల బంధం నీదీ నాదీ, నువ్వడిగింది ఏనాడైనా కాదన్నానా, సాగర సంగమమే, ఆలోకయే శ్రీ బాలకృష్ణం, రోజాలో లేతవన్నెలే, ఒక బృందావనం, ప్రణతి ప్రణతి ప్రణతి.. ప్రణవ నాద జగతికి, బ్రోచేవారెవరురా, దొరకునా ఇటువంటి సేవా, మానస సంచరరే, పలుకే బంగారమాయెనా, ఏ తీరుగ నను దయచూచెదవో'.. వంటి ఎన్నో మధురమైన గీతాలు ఆలపించారు వాణీ జయరాం. తెలుగు ,తమిళ ,హిందీ ,మలయాళ ,గుజరాతీ ,మరాఠీ ,ఒరియా ,భోజ్ పురి మొత్తం 19భాషల్లో 20 వేలకు పైగా పాటలను ఆమె పాడారు. కర్ణాటక సంగీతాన్ని ఆమె ఔపోసన పట్టారు. తన ఎనిమిదవ ఏటనే కచేరీలు నిర్వహించి అందరి ప్రశంసలు

పొందారు. ముత్తు స్వామి దీక్షితార్ కీర్తనలు చక్కగా పాడేవారు. ఆమె దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గొప్ప నేపథ్య గాయనిగా ఆమె పేరు తెచ్చుకున్నారు. 1970లో మొదటి సారిగా గుడ్డి సినిమాలో పాడిన 'బోల్ రే పపీ హరా' వాణీ జయరాం పాడిన మొదటి సినిమా పాటకు లయన్ ఇంటర్నేషనల్ బెస్ట్ ప్రామిసింగ్ సింగర్, తాన్ సేన్ అవార్డులాంటి ఐదు అవార్డులు అందుకున్నారు. కే. బాల చందర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ సినిమా అపూర్వ రాగంగల్ కు మొదటి సారి జాతీయ అవార్డు అందుకున్నారు. శంకరా భరణం చిత్రంలోని 'దొరకునా ఇటువంటి సేవ' పాటకు, స్వాతి కిరణం చిత్రంలోని ఆనతి నియరా◌హరా◌అనే పాటకు గాను మరో సారి జాతీయ అవార్డును తీసుకున్నారు..

ఆమెకు కొద్ది రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం పద్మభూషన్ అవార్డును ప్రకటించింది. స్వరవాణి వాణీ జయరాం మృతితో దక్షిణాది చిత్ర పరిశ్రమ మరో గాన కోకిలను కోల్పోయిందని తెలుగు కళా సమితి కార్యవర్గం విచారం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## జమున



తెలుగింటి సత్యభామగా గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటి జమున (86) గత కొంతకాలంగా వయోసంబంధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జనవరి 27 ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు.



జమున గారు 1936 ఆగస్ట్ 30న నిప్పని శ్రీనివాసరావు, కౌసల్యా దేవి దంపతులకు హంపీ లో జన్మించారు. సినిమాల్లోకి రాక ముందు ఆమె పేరు జానా బాయి. అయితే జ్యోతిష్కుల సూచనతో ఆమె పేరును జమునగా మార్చారు. తల్లి దగ్గరే సంగీతం, హార్మోనియం నేర్చుకున్నారు. నటుడు జగ్గయ్య గారు ఖిల్జీ రాజ పతనం అనే నాటకంలో పాత్రకోసం జమునను ఎంపిక చేశారు. 14 ఏండ్ల వయస్సులోనే సినిమాల్లోకి ప్రవేశించారు. 1953లో నటించిన పుట్టిల్లు ఆమె తొలి చిత్రం.

తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 198 సినిమాల్లో ఆమె నటించారు. ఇందులో తెలుగులో 145 సినిమాలు ఉండగా, తమిళం 20, కన్నడం 7, హిందీలో 10 చిత్రాల చొప్పున ఉన్నాయి. 1964లో విడుదలైన మూగ మనసులు సినిమాలకు గాను ఉత్తమ సహాయ నటిగా ఫిలింఫేర్ అవార్డు అందుకున్నారు. 1968లో మరోసారి ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు. మిలన్ చిత్రంలో గౌరీ పాత్రకు బాలీవుడ్ ఫిల్మ్‌ఫేర్ లభించింది. 2008లో ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చిన తొలితరం నాయిక జమున కావడం విశేషం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆహ్వానంతో 1980లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం 1989లో రాజమండ్రి నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు.. రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా పనిచేశారు.








Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
**ntheivakuma@ft.newyorklife.com**

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**